ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు



TGTEL/25/A1132

మానవాళికి

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..

| మేడ్చల్ | ఆదివారం | 16.08.2026 | సంపుటి : 2 | సంచిక : 45 | పేజీలు : 8 | వెల : 5/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు |
|---|---|---|---|---|---|---|---|




## భారత్‌కు ప్రపంచస్థాయి
# నాయకత్వ లక్షణం

**అన్ని రంగాల్లో దూసుకు పోయే తత్వం**

**సత్తా చాటగల నైపుణ్యాలు మన సొంతం**

**యువత ఓ గంట సమయం కేటాయిస్తే చాలు**

**జనగణనలో ఖచ్చితమైన సమాచారం ఇవ్వండి**

**ఎర్రకోట నుంచి ప్రధాని మోడీ పిలుపు**

**ఎర్రకోట వేడుకలకు దూరంగా రాహుల్, ఖర్గే**

భారత్‌కు ప్రపంచస్థాయి నాయకత్వ లక్షణాలు ఉన్నాయని, అన్నిరంగాల్లో దూసుకుపోయే సమర్థత ఉందని ప్రధాని మోడీ అన్నారు. సవాళ్లు స్వీకరించి ముందుకు సాగడం ద్వారా మనమేంటో సత్తా చూపగలమన్నారు. ఎర్రకోట వేదికగా ప్రధాని మోడీ యువత లక్ష్యంగా పలు కార్యక్రమాలను ప్రకటించారు.

న్యూఢిల్లీ, ఆగస్ట్ 15 : కోటి మంది యువతకు ఏఐ నైపుణ్యాలలో శిక్షణ ఇస్తామని, పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందిస్తామన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఉన్న ఆర్థిక భారాన్ని తగ్గించడమే.. ఉచిత కోచింగ్ కార్యక్రమ లక్ష్యమని చెప్పారు. అలాగే ప్రస్తుతం దేశంలో జరుగుతోన్న జనగణన గురించి ప్రస్తావించారు. దానిలో యువత చురుగ్గా పాల్గొనాలని మోదీ పిలుపునిచ్చారు.'నేను అందరినీ ఒక ఫేవర్ చేయాలని అడుగుతున్నాను. ఒక గంటా, రెండు గంటల సమయం కేటాయించండి. అది దేశానికి ఎంతో ఉపయోగపడుతుంది. ఆ మాత్రం సమయం దేశాన్ని ఎలా బలోపేతం చేస్తుందా..? అని యువత ఆలోచిస్తూ ఉండొచ్చు. వారి భాగస్వామ్యంతో ప్రతి ఇంట్లో జనాభా గణనకు ఒక అనుకూల వాతావరణం ఏర్పడేందుకు అవకాశం ఉంటుంది. గణన అంటే లెక్కలన్నీ ఒక దగ్గర రాసుకోవడం కాదు. జనాభా లెక్కల సమయంలో ప్రజలు ఇచ్చే వివరాల ఆధారంగానే జాతీయ విధానాలు, పథకాలు

-మిగతా 2 లో..

## కీలక బాధ్యతగా
# ఉద్యోగ నియామకాలు

**ఇప్పటికే 72 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ**

**గ్రూప్ పరీక్షలను సమర్థంగా నిర్వహించాం**

**త్వరలోనే ఇంటర్‌నేషనల్ స్పోర్ట్స్ నిర్వహణ**

**ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచాం**

**తెలంగాణ రైజింగ్-2047' దిశగా అడుగులు వేస్తున్నాం**

**గోల్కొండ కోట నుంచి ప్రజలనుద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగం**



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దుర్మార్గాలన్నీ బయటపడుతున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, రాహుల్ గాంధీ తెలిపారు. మోదీ తప్పులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాహుల్ సూచించారు. అందుకు కార్యకర్తలు యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు. వికారాబాద్‌లో పీపీసీ సభ్యులతో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ భేటీ అయ్యారు.

వికారాబాద్, మార్చి 2 : ఈ సమావేశంలో రాహుల్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టాలని సూచించారు. దేశంలో నెలకొన్న పరిస్థితులపై సమావేశంలో మాట్లాడిన రాహుల్ గాంధీ.. యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇరాన్ లాంటి పరిస్థితులు దేశానికి రాకుండా

## రేషన్ కార్డు ఆత్మగౌరవ ప్రతీక



**పేదరికం నిర్మూలించే బలమైన అడుగు**

**పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వని బిఆర్ఎస్**

**రేషన్ కార్డులతో పాటు..సన్న బియ్యం ఘనత మాదే**

**సంక్షేమ కార్యక్రమాలపై అసెంబ్లీలో చర్చకు సిద్ధం**

**సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన సిఎం రేవంత్**

02

## దేశంలో ఎక్కడా సన్నబియ్యం పంపిణీ లేదు

**89 లక్షల కార్డులను 2.80 కోట్లకు చేర్చాం**

**బిఆర్ఎస్ నేతలు తప్పడు ప్రచారాలు మానాలు**

**సంగారెడ్డి సభలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



సంగారెడ్డి, ఆగస్ట్ 15 : తెలంగాణలో ఇస్తున్నట్టు దేశంలో ఎక్కాడా కూడా సన్నబియ్యం పంపిణీ జరగడం లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సంగారెడ్డిలో నిర్వహించిన కొత్త స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. 3.42 కోట్ల మందికి రూ. 14800 కోట్లతో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో 89 లక్షల రేషన్ కార్డులు ఉంటే.. వాటిని 2.80 కోట్లకు పెంచామని తెలిపారు. రేషన్ కార్డుల మంజూరు.. నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ పార్టీలోని నేతలు పదే పదే అబద్దాలు చెబుతున్నారని మండిపడ్డారు. మేడిగడ్డ, సుందిళ్ల నుంచి చుక్క నీరు తీసుకోకుండా దేశంలోనే ఎక్కువ ధాన్యాన్ని తెలంగాణలో పండించామన్నారు.

-మిగతా 2 లో..



## స్మార్ట్ రేషన్‌కార్డులపై సీఎం, మంత్రుల ఫొటోలెందుకు?

**2 కోట్ల మందికి కేంద్రం ఉచిత బియ్యం ఇస్తోంది: బండి సంజయ్**

హైదరాబాద్: కేంద్రం రేషన్ బియ్యం ఇస్తున్నా.. స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని ఫొటో పెట్టకుండా సీఎం, మంత్రుల ఫొటోలు ఎందుకు పెడుతున్నారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. మోదీ ఇస్తున్న బియ్యం అవసరం లేదని కేంద్రానికి లేఖ రాయగలరా? అని రాష్ట్ర ప్రభుత్వానికి సవాల్ విసిరారు. శనివారం హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ...

-మిగతా 2 లో..

## సంగారెడ్డి సభలో రేవంత్
# అబద్దాల ప్రచారం

**కెసిఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్న పెద్దమనిషి**

**మీడియా సమావేశంలో మండిపడ్డ హరీష్ రావు**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఖండించారు. సంగారెడ్డిలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి అడ్డగోలు వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. దేశంలో స్వాతంత్ర్య దినోత్సవం రోజునా చిల్లర మాటలు మాట్లాడిన ముఖ్యమంత్రి మరొకరు ఉండరని విమర్శించారు.



సిద్దిపేట, ఆగస్ట్ 15 : సిద్దిపేటలోని తన క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి హరీశ్ రావు మీడియా సమావేశం నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి సాయంత్రం 4:20 గంటలకు ప్రసంగం ప్రారంభించి 420 మాటలు మాట్లాడారని మండిపడ్డారు. ఆయన తన ప్రసంగంలో ఉమ్మడి మెదక్ జిల్లా గురించి ఒక్క మాటా మాట్లాడలేదని ధ్వజమెత్తారు. రేవంత్ చేతకానితనం వల్లే సింగూరు ఖాళీ అయిందని ఆరోపించారు. కామారెడ్డి జిల్లాకు మంచినీళ్లు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంగారెడ్డి బాగుపడాలని గత ప్రభుత్వం సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులను ప్రారంభిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని మూలన పడేసిందని నిప్పులు చెరిగారు.

-మిగతా 2 లో..



**నేటి చికెన్ ధరలు**

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 235 (కిలో) |
| స్కిన్ లెస్ | 267 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹74

## చరిత్ర తెలుసుకుంటేనే..
# భవిష్యత్ నిర్మాణం

**టిఆర్ఎస్ కార్యాలయంలో జెండా ఆవిష్కరణలో కవిత**

చరిత్రను తెలుసుకున్న వాళ్లే భవిష్యత్తును చక్కగా నిర్మించగలరని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత అన్నారు. టీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత జాతీయ జెండాను ఎగురవేశారు.



03



## ప్రజల అవసరాలు గుర్తించి
# సంక్షేమ పాలన

**అన్ని వర్గాలకు న్యాయం చేయడం కోసం కృషి**

**స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో డిప్యూటీ సిఎం భట్టి**

03



04

## నేడు తెరుచుకోనున్న శబరిమల ఆలయం

కేరళలోని ప్రసిద్ధ శబరిమల అయ్యప్ప ఆలయం ఆదివారం తెరుచుకోనుంది. చింగం మాస పూజల నిమిత్తం ఆలయాన్ని తెరుస్తున్నామని, భక్తులకు సౌకర్యాలు కలిపించేందుకు ట్రావెన్ కోర్ దేవస్థానం బోర్డ్ (టీడీబీ), కేఎస్ఆర్‌టీసీ తగిన ఏర్పాట్లు చేస్తున్నాయని అధికారులు తెలిపారు.



# భారత్‌కు ప్రపంచస్థాయి నాయకత్వ లక్షణం

(మొదటిపేజీ తరువాయి)

రూపుదిద్దుకుంటాయి. దేశ ప్రగతికి ఆ లెక్కలు సూచీగా ఉంటాయి. అందుకే కచ్చితమైన, స్పష్టమైన సమాచారం ఇవ్వడం అత్యంత కీలకం అని మోదీ పేర్కొన్నారు. అలాగే 'దిమాగీ నక్సల్స్' గురించి మాట్లాడుతూ.. వారిని దేశానికి కొత్త శత్రువులుగా అభివర్ణించారు. 'సంవత్సరాలుగా మావోయిస్టు భావజాలం ఉన్న వ్యక్తులు దేశంలో బలంగా పాతుకుపోయారు. అడవుల్లోని సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించి, ఆ సంక్షోభం నుంచి దేశాన్ని విముక్తి చేయడంలో ప్రభుత్వం విజయం సాధించింది. సాయుధ నక్సల్స్ కనుమరుగైనా.. 'దిమాగీ నక్సల్స్' మిగిలి ఉన్నారు. వారు ఒక అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. సమాజాన్ని తప్పుడు మార్గంలోకి లాగడానికి వారు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. మనం వారిని గుర్తించి.. ఏకాకిని చేయాలని సూచించారు. తయారీ, వ్యవసాయం, సాంకేతికత, మౌలిక సదుపాయాలు, రక్షణ రంగం, గ్రీన్ అండ్ బ్లూ ఎకానమీ, ఇండియాస్ సాఫ్ట్ పవర్ కోసం 'సప్తధార' రోడ్‌మ్యాప్‌ను మోదీ ప్రకటించారు. మహిళా కోటా బిల్లుపై ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో.. తన ప్రసంగంలో దాని ప్రస్తావన తీసుకువచ్చారు. ప్రతిపక్షాలు విభేదాలను పక్కనపెట్టి.. పార్లమెంట్, శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు సహకరించాలని కోరారు. క్రెడిట్ వారే తీసుకున్నా ఫర్వాలేదని, కానీ బిల్లు పాసయి మహిళలకు గౌరవం దక్కాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. భారత్ ఇకపై చిన్న కలలతో ముందుకు వెళ్లలేదని, ఆలోచనా పరిధి విస్తృతం చేసుకునేందుకు ఉన్నత లక్ష్యాలు అవసరమని మోదీ పిలుపునిచ్చారు. భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారినప్పుడు ప్రపంచం మన వైపు చూసే తీరే మారుతుందని పేర్కొన్నారు. ఇతర దేశాలపై ఆధారడి జీవించలేమని, స్వయం సమృద్ధి సాధించాలన్నారు. టెక్ ప్రపంచంలో చిప్‌ల విలువను భారతదేశం అర్థం చేసుకుంటోందని, అందుకే మూడు సెమీకండక్టర్ ప్లాంట్లను ఏర్పాటు చేసిందని తెలిపారు. సమీప భవిష్యత్తులో మరిన్ని సెమీకండక్టర్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇప్పుడు ప్రతిభారతీయుడు స్థానిక ఉత్పత్తులకు మద్దతు ఇవ్వడంపై సంతోషం వ్యక్తంచేశారు. తమ ప్రభుత్వ హయాంలో 25 కోట్లమంది పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపారు. అభివృద్ధి దిశగా దృఢ సంకల్పంతో పయనిస్తోన్న 140 కోట్ల మంది భారతీయులను ఆపడం అసాధ్యం అని పేర్కొన్నారు. దేశంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల సంభవించిన విపత్తుల గురించి ప్రస్తావించారు. బాధిత కుటుంబాలకు దేశం మొత్తం అండగా ఉంటుందని సంఘీభావం తెలిపారు. దేశంలో 70 నగరాల్లో పైప్‌లైన్ ద్వారా గ్యాస్ అందిస్తున్నాం. 1.75 కోట్ల ఇళ్లకు పైప్ ద్వారా వంటగ్యాస్ సరఫరా చేస్తున్నాం. ఇంధన భద్రత సాధించడం దేశ తక్షణ అవసరం. వంద గిగావాట్ల అణు ఇంధనం సాధించడం మనలక్ష్యం అన్నారు. ఇటవలే హైడ్రోజన్ రైలును విజయంతంగా నడిపించాం. 90 ఏళ్లలో 30 శాతం మాత్రమే రైళ్ల ఎలక్ట్రిఫికేషన్ జరిగింది. 10 ఏళ్లలో 70 శాతం రైళ్ల ఎలక్ట్రిఫికేషన్ పూర్తి చేశాం. ఇటీవలే హైడ్రోజన్ రైలును విజయవంతంగా నడిపించామని అన్నారు. 50 లక్షల ఇళ్లకు సౌరశక్తి విద్యుత్ అందిస్తున్నాం. దేశంలో ఐదు న్యూక్లియర్ రియాక్టర్లు ఏర్పాటు చేస్తున్నామని మోదీ తెలిపారు. అయితే స్వాతంత్ర్య వేడుకల్లో ఈసారి కూడా లోక్‌సభ, రాజ్యసభల్లో విపక్ష నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే హాజరుకాలేదు. సీటింగ్, ఇతర ప్రొటోకాల్స్ వారి పదవులకు అనుగుణంగా ఉండటం లేదని కాంగ్రెస్ గతంలో ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వారు వరుసగా రెండోసారి గైర్హాజరయ్యారు.

# దేశంలో ఎక్కడా సన్నబియ్యం పంపిణీ లేదు

(మొదటిపేజీ తరువాయి)

వరి కొనుగోళ్లలో రూ.90 వేల కోట్లు.. రైతుల ఖాతాల్లో వేశామని అన్నారు. ఈరోజు సంగారెడ్డి చరిత్రలోనే కాదు, తెలంగాణ చరిత్రలోనే ప్రత్యేకమైన రోజుగా నిలిచిపోనుందన్నారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు రేషన్ కార్డులు ఇవ్వలేదని మంత్రి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నిరుపేదలకు రేషన్ కార్డుల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిందని వెల్లడించారు. కొత్తగా 16 లక్షల మందికి రేషన్ కార్డులు ఇచ్చామని అన్నారు. ఃఖా హయాంలో రేషన్ కింద దొడ్డు బియ్యం ఇచ్చారని.. అప్పుడు ఆ బియ్యాన్ని ఎవరూ తినకుండా కిలో రూ.10కి అమ్ముకునే వారని తెలిపారు. కాంగ్రెస్ వచ్చాక సన్న వడ్లకి రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేసి వాటినే పంపిణీ చేస్తున్నామని చెప్పారు. నాణ్యత ఉన్న సన్న బియ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ రోజు చరిత్రలో పండుగలా గుర్తుండిపోతుంది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత వచ్చిన ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 16 లక్షల కొత్త కార్డులు ఇచ్చాం. గతంలో రేషన్‌లో దొడ్డు బియ్యం వచ్చేవి. ఆ బియ్యాన్ని 80 శాతం మంది తినేవారు కాదు. కానీ, కాంగ్రెస్ సర్కార్ వచ్చాక సన్నబియ్యానికి రూ.500 బోనస్ ఇచ్చి కొంటున్నాం. మనిషికి ఆరు కిలోల చొప్పున ఉచితంగా సన్న బియ్యం ఇస్తున్నాం. దేశంలో మరే రాష్ట్రంలోనూ సన్నబియ్యం ఇవ్వడం లేదు. కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారి అర్హతలను పరిశీలించి కార్డులు ఇస్తాం అని ఉత్తమ్ తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డు అంటే కుటుంబానికి గౌరవమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. స్మార్ట్ రేషన్ కార్డు అంటే ఆహార భద్రత, ప్రభుత్వం ఇచ్చే ఒక గుర్తింపు అని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని పథకాలు ఇక్కడ అమలు చేస్తున్నామని, నియోజకవర్గానికి మూడు వేల ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని చెప్పారు.

# సంగారెడ్డి సభలో రేవంత్ అబద్ధాల ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

జహీరాబాద్‌లో బసవేశ్వర విగ్రహం ప్రారంభించి ఏడాది అయిందని, ఆ రోజు ఇచ్చిన హామీలు ఒక్కటైనా అమలయ్యాయా? అని హరీశ్ రావు ప్రశ్నించారు. సంగారెడ్డి జిల్లాలో ఈ మూడేళ్లలో ఒక్క రోడ్డు అయినా వేశారా? అని నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో 6 లక్షలకు పైగా రేషన్ కార్డులు ఇచ్చారని అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారని, కానీ నేడు సంగారెడ్డిలో రేషన్ కార్డులు ఇవ్వలేదని చెబుతున్నారని ఆగ్రహించారు. నిస్సిగ్గుగా అబద్ధాలు మాట్లాడే రేవంత్ రెడ్డికి ప్రజలే బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్షలు నిర్వహిస్తే రేవంత్ నియామక పత్రాలు ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఎంపీ రాహుల్ గాంధీని పిలిచి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని, మాట తప్పినందుకు నిరుద్యోగులకు రేవంత్ క్షమాపణలు చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. గన్‌మెన్లు లేకుండా అశోక్ నగర్‌కు వస్తావా? అంటూ ఈ సందర్భంగా మాజీ మంత్రి సవాల్ విసిరారు. మరోవైపు, రెండేళ్ల ఫీజురీయింబర్స్‌మెంట్ ఎప్పుడూ ఇస్తారో చెప్పాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వని ఆ కాలేజీలు, విద్యార్థుల భవిష్యత్తు ఏంటని ప్రశ్నించారు. విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో ఆటలు ఆడుతున్నారని మండిపడ్డారు. అలాగే, రైతుల గురించి మాట్లాడే అర్హత రేవంత్ రెడ్డికి లేదన్నారు. కేసీఆర్ హయాంలో వరుసగా మూడేళ్లలో రూ.14,656 కోట్లు, రూ.14,721 కోట్లు, రూ.14,721 కోట్లు చొప్పున రైతు బంధు ఇచ్చారని పేర్కొన్నారు. 2024-25లో రేవంత్ ఇచ్చింది రూ.5,057 కోట్లేనని మండిపడ్డారు. 2025-26లో రూ.11 వేల కోట్లు మాత్రమే ఇచ్చారని ఆరోపించారు. కేసీఆర్ ఇచ్చిన దానికంటే రూ.15 వేల కోట్లు రేవంత్ తక్కువ ఇచ్చారని విమర్శించారు. రేవంత్ రెడ్డి సొంత ఊరికి వెళ్లి రుణమాఫీ అయ్యిందో, లేదో అక్కడి రైతులను అడగాలన్నారు. ఆ రైతులు రుణమాఫీ అయ్యిందని చెబితే తాను రాజీనామా చేస్తానని, అవ్వలేదని చెబితే రేవంత్ రెడ్డి రాజీమానా చేస్తారా? అని సవాల్ చేశారు.

# కీలక బాధ్యతగా ఉద్యోగ నియామకాలు

**హైదరాబాద్, ఆగస్ట్ 15 :** ఉద్యోగ నియామకాలను ప్రభుత్వం అత్యంత కీలక బాధ్యతగా తీసుకుందని, ఇప్పటి వరకు 72 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను పూర్తి చేశామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. గ్రూప్1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, మెగా డీఎస్సీ నియామకాలను విజయవంతంగా నిర్వహించి నియామక పత్రాలు అందించామని తెలిపారు. యువతకు నైపుణ్యం, ఉద్యోగాలు కల్పించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలలను అప్‌గ్రేడ్ చేస్తున్నామని వివరించారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ అకాడమీ, యంగ్ ఇండియా డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ స్కిల్లింగ్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని, త్వరలోనే తెలంగాణ వేదికగా యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ 2026 నిర్వహించబోతున్నామని చెప్పారు. గోల్కొండకోటలో త్రివర్ణ పతాకం ఎగురవేసిన సిఎం ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. వైద్యరంగంలో ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని, నిమ్స్‌లో 2,000 పడకల నూతన ఆసుపత్రి నిర్మాణంతో పాటు వరంగల్, సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మిస్తున్నామని తెలిపారు. కొత్తగా 8 మెడికల్ కళాశాలలు, 16 నర్సింగ్ కళాశాలలు, 28 పారామెడికల్ కళాశాలలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. దక్షిణ భారతదేశంలోనే తొలి కిడ్నీ ట్రాన్స్‌లాంటేషన్ సెంటర్ నిర్వహణ ఇందుకు నిదర్శనమని, ఇప్పటి వరకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 5.18 లక్షల మందికి రూ.2,526 కోట్ల సాయం అందించామని వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో తెలంగాణ పోలీసులకు సరికొత్త సాంకేతికత, వనరులను అందిస్తున్నామని సీఎం చెప్పారు. సైబర్ నేరాలు, ఆహార కల్తీని ఎదుర్కొనేందుకు డ్రగ్స్ కంట్రోల్, సైబర్, ఆహార కల్తీ నియంత్రణ లను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తున్నామని తెలిపారు. ఓఆర్ఆర్‌పై ప్రమాదాలు తగ్గించేందుకు హైవే ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సెంటర్లు, మహిళల భద్రతకు షీ టీమ్స్, పిల్లల అనుకూల న్యాయస్థానాల ఏర్పాటులో తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఉద్యోగుల సంక్షేమం పట్ల శ్రద్ధతో నిర్ణయాలు తీసుకుంటున్నా మని, పీఆర్సీ, పెన్షన్లు, ఎంఎ÷-లాయీస్ హెల్త్ స్కీమ్ వంటివి అమలు చేస్తున్నామని తెలిపారు. 36 సచివాలయ శాఖల్లో 100 శాతం ఈ-ఆఫీస్ అమలు చేశామని, ఈ నెల 17వ తేదీ నుండి అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో 'ప్రజావాణి' ప్రారంభిస్తున్నామని ప్రకటించారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో రెండో దశ, మూసీ పునరుజ్జీవనం, చెరువుల పరిరక్షణకు 'హైడ్రా' ఏర్పాటు వంటి చర్యలు చేపడుతున్నామని సీఎం వివరించారు. పారిశ్రామికంగా టి-ఐడియా ద్వారా రూ.1.29 లక్షల కోట్ల పెట్టుబడులు, తెలంగాణ గ్లోబల్ ఏఐ సమ్మిట్ ద్వారా రూ.5.75 లక్షల కోట్ల ఒప్పందాలు సాధించామని, 2025-26లో ఐటీ ఎగుమతులు రూ.3.97 లక్షల కోట్లకు చేరాయని వెల్లడించారు. తొలి సమగ్ర టూరిజం పాలసీ 2025 తీసుకువచ్చామని, సమ్మక్క సారలమ్మ జాతర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను మార్చాలనే సంకల్పంతో 'తెలంగాణ రైజింగ్-2047' దిశగా అడుగులు వేస్తున్నామని, అందరి సహకారంతో రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని సీఎం ప్రసంగాన్ని ముగించారు.



# రేషన్ కార్డు ఆత్మగౌరవ ప్రతీక

- పేదరికం నిర్మూలించే బలమైన అడుగు
- పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వని బిఆర్ఎస్
- రేషన్ కార్డులతో పాటు..సన్న బియ్యం ఘనత మాదే
- సంక్షేమ కార్యక్రమాలపై అసెంబ్లీలో చర్చకు సిద్ధం
- కెసిఆర్ వస్తే ఎవరేం చేశారో చర్చిస్తాం
- బిజెపి, బిఆర్ఎస్ నాణెళినికి బొమ్మా బొరుస లాంటివి
- సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన సిఎం రేవంత్

**సంగారెడ్డి,ఆగస్ట్15 :** స్మార్ట్ రేషన్ కార్డు అనేది కేవలం ఒక ప్లాస్టిక్ కార్డు లేదా ఉచితంగా బియ్యం పొందే సాధనం మాత్రమే కాదని, పేదరికాన్ని నిర్మూలించే దిశగా వేసిన బలమైన అడుగని సిఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ రాజ్యంలో ఏ పేదవాడు ఆకలితో అలమటించకూడదనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ పార్టీ నాడు రేషన్ వ్యవస్థను తీసుకొచ్చిందని అన్నారు. గతంలో ఇందిరాగాంధీని మెదక్ ఎంపీగా గెలిపించడం వల్లే ఈ ప్రాంతం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిందని కొనియాడారు. సంగారెడ్డి వేదికగా జరిగిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. నాయకుడు జగ్గారెడ్డి పర్యవేక్షణలో స్వాతంత్ర్య దినోత్సవం రోజున వేలాదిమంది మహిళల సమక్షంలో ఈ సభ నిర్వహించు కోవడం ఎంతో ఆనందంగా ఉందని ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఆశయాలను ఆదర్శంగా తీసుకునే తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు వేర్వేరు కాదని, ఆ రెండు పార్టీలు ఒకే నాణెళినికి బొమ్మ, బొరుసు లాంటివని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఏనాడైనా పేద ప్రజల ఆకలి తీర్చాలని ఆ పార్టీలు ఆలోచించలేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో దాదాపు 3 కోట్ల 48 లక్షల మంది ప్రజలకు నాణ్యమైన సన్న బియ్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన బియ్యం దొడ్డుగా ఉండి, మనుషులు తినలేక బర్లకు దాణాగా వేసే పరిస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు తాము ఇస్తున్న సన్న బియ్యం ప్రతి పేద కుటుంబానికి కడుపు నింపుతోందని వివరించారు. తెలంగాణలో 1.06 కోట్ల మందికి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అత్యాధునిక సెక్యూరిటీ ఫీచర్లతో వీటిని రూపొందించినట్లు పేర్కొన్నారు. దేశంలో సన్నబియ్యం ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఈ సందర్భంగా ఆయన ధీమా వ్యక్తం చేశారు. పేదలకు రూ.14,800 కోట్లతో ఉచితంగా సన్నబియ్యం ఇస్తున్నట్లు సీఎం చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు రేషన్ కార్డులు ఇవ్వలేదు. మేం అధికారంలోకి వచ్చాకే ఇవ్వడం ప్రారంభించాం. రేషన్ విషయంలో విప్లవాత్మక మార్పులు తెచ్చాం. గతంలో ఇచ్చిన దొడ్డు బియ్యాన్ని ఎవరూ తినేవారు కాదు.. పైగా పక్కదారి పట్టేవి. పేదల ఆకలి తీర్చేదే ఈ స్మార్ట్ రేషన్ కార్డు. అసలు రేషన్ షాపులు తెచ్చిందే కాంగ్రెస్. పేదలకు కూడు, గూడు, గుడ్డ ఉండాలని ఇందిరమ్మ ఆలోచన చేశారు. వారికి సంక్షేమం అందించడం మా బాధ్యత. రేషన్ కార్డు అనేది పేదల ఆత్మగౌరవం. వారికి ప్రతినెలా 6 కిలోల చొప్పున సన్నబియ్యం ఇస్తున్నాం. దీని వల్లే మార్కెట్‌లో బియ్యం ధరలు తగ్గాయన్నారు. ల్గ÷తులకు ఎవరేం చేశారో అసెంబ్లీలో చర్చకు కేసీఆర్ సిద్ధమా?. పదేళ్లలో మీరేం చేశారో.. రెండున్నరేళ్లలో మేమేం చేశామో చర్చిద్దాం అని సవాల్ చేశారు. అతి తక్కువ అప్పుల్లో తెలంగాణ రైతులు ఉన్నారని కేంద్రం చెబుతోంది. కేంద్రం చెప్పేది బీజేపీ నేతలకు కనిపించడం లేదా అని అన్నారు. రైతులు పండించిన వడ్లకు రూ.90 వేల కోట్లు బదిలీ చేశాం. ఉచిత విద్యుత్ కోసం రూ.30 వేల కోట్లు ఖర్చు చేశాం. గత పాలకులు బతుకమ్మ చీరల్లోనూ కమిషన్లు నొక్కారు. గతంలో పాలపిట్ట చీరలు ఇచ్చాం.. ఈసారి చిలకపచ్చ చీరలు ఇస్తాం. ఆడబిడ్డలకు ఉచిత బస్సు కోసం రూ.11 వేల కోట్లు ఖర్చు చేశాం. ఆనాడు డబుల్ బెడ్‌రూమ్ అంటూ డబ్బా కొట్టారు. పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు రాలేదు కానీ వారికి మాత్రం ఫామ్‌హౌస్‌లు వచ్చాయి. మేము 7 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇస్తున్నాం. తెలంగాణలో ఇందిరమ్మ ఇల్లు లేని ఊరేలేదు. కొత్తగా 2.5 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేశాం. అర్హులైన చేనేత, గీత కార్మికులందరికీ పెన్షన్లు ఇస్తాం అని సిఎం అన్నారు. పదేళ్లపాటు మహిళలకు మంత్రి పదవి ఇవ్వని వారు నేడు మహిళల గురించి మాట్లాడుతున్నారు. కేసీఆర్ ఇంట్లో అందరికీ ఉద్యోగాలు వచ్చాయి. నిరుద్యోగులకు మాత్రం ఉద్యోగాలు రాలేదు. త్వరలోనే ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేస్తాం. అగ్గిపెట్టె రావు, అఘోరా రావులు వస్తారు.. జాగ్రత్త. వీళ్లకు అగ్గిపెట్టెలు దొరకవు కానీ అమాయక యువతను మాత్రం బలిచేశారు. శవాలపై పెట్టుబడులు పెట్టి అధికారంలోకి రావాలని చూస్తున్నారు. మాట ఇస్తే మట్టిలో కలిసే వరకు నిలబడి ఉంటామని రేవంత్ అన్నారు.. ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేసేందుకు చిత్తశుద్ధితో ఉన్నాం. దుర్మార్గులు, దుష్టులు మాయమాటలతో వస్తారు. యువత అప్రమత్తంగా ఉండాలి. మాయమాటలను నమ్మొద్దు. బీఆర్ఎస్ వాళ్లు చేసిన అప్పులకు రూ.75 వేల కోట్ల వడ్డీ కడుతున్నాం. రాష్ట్రాన్ని సంక్షోభం నుంచి సంక్షేమం వైపు నడిపిస్తున్నాం' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణా-గోదావరి జలాల్లో రాజీపడే ప్రసక్తే లేదు

**సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది**

**31 నెలల కృషి ఫలితాలు ఇప్పుడిప్పుడే కనిపిస్తున్నాయి**

**తలసరి ఆదాయంలో టాప్‌లో ఉన్నాం**

**రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటదన్న నమ్మకం**

**అధికారంలోకి రాగానే 2లక్షల రుణామాఫీ చేపట్టాం**

**గోల్కొండలో జెండా ఎగరేసిన సిఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్,ఆగస్ట్15 :** తెలంగాణ నీటి హక్కుల విషయంలో రాజీ పడేది లేదని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి రైతుల కళ్లలో ఆనందం చూస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గోల్కొండ కోటలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడకలకు సీఎం ముఖ్యఅతిథిగా హాజరై జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. విద్య, వైద్యం.. ఈ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్య అంశాలని తెలిపారు. సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం తమది అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గోల్కొండ కోటపై సీఎం జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ.. ఈ ప్రభుత్వ 32 నెలల కృషి ఇప్పుడిప్పుడే కనిపిస్తోందని.. తలసరి ఆదాయంలో టాప్‌లో ఉన్నామన్నారు. వ్యవసాయాన్ని పండగ చేయాలని నిర్ణయించామని తెలిపారు. రైతు బాగుంటేనే.. రాష్ట్రం బాగుంటుందన్న ముఖ్యమంత్రి.. రైతు సంక్షేమం కోసం అనేక పథకాలు చేపట్టామన్నారు. రైతు భరోసా కింద రూ.36వేల కోట్లు పెట్టుబడి సాయం అందించామని చెప్పారు. అలాగే, రైతు సంక్షేమం కోసం రూ.లక్షా 70వేల కోట్లు, రూ.2లక్షల వరకు రైతు రుణమాఫీ చేశామని వివరించారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ రికార్డులు సృష్టించిందని తెలిపారు. కృష్ణా-గోదావరి జలాల్లో రాజీపడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తెలంగాణకు రావాల్సిన ప్రతి నీటి బొట్టును సాధించి తీరుతామన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేసి రైతుల కళ్లల్లో ఆనందం చూస్తామన్నారు. త్వరలోనే పాలమూరు పూర్తి చేసి నీరందిస్తామని తెలిపారు. వ్యవసాయంతో పాటు ఇళ్లకు ఉచిత కరెంట్ ఇస్తున్నామని, కల్యాణలక్ష్మి కింద ఆడబిడ్డలకు రూ.4,790 కోట్లు అందజేశామని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే సంకల్పంతో ఉన్నామని చెప్పుకొచ్చారు. 15 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని,2 విడతల్లో 5.50లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్లు నిర్మించి అందించనున్నామని తెలియజేశారు. దేశంలోనే తొలిసారి తెలంగాణలో కులగణన జరిగిందని.. తెలంగాణ ఒత్తిడి వల్లే కేంద్రం జనగణనలో కులగణన చేర్చిందని తెలిపారు. కొత్తగా 2.50లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేస్తున్నామన్నారు. సినీ కార్మికుల సంక్షేమం కోసం త్వరలో బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. విద్యా సూచీలో 21 నుంచి 14వ స్థానానికి తెలంగాణ చేరిందని రేవంత్ తెలిపారు. నియోజకర్గానికొక ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణాన్ని చేపట్టామన్నారు. స్కూళ్లలో అల్పాహారం, మధ్యాహ్న భోజనం పెడుతున్నామని, 100కు పైగా తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు నిర్మించే యోచనలో ఉన్నామని చెప్పారు. అక్రమాలు జరగకుండా ఃఉఖాఅని ప్రక్షాళన చేశామన్నారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకు సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే ఉస్మానియా కొత్త ఆసుపత్రి భవనం నిర్మాణంలో ఉంది. 8 కొత్త మెడికల్ కాలేజీలకు భవనాలు నిర్మిస్తున్నాం. విద్యా సూచీలో 21వ స్థానంలో ఉన్న తెలంగాణ 14కు చేరుకుంది. నియోజకవర్గానికొక ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపట్టాం. వందకు పైగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ నిర్మించే లక్ష్యంతో ఉన్నాం. ప్రభుత్వ స్కూళ్లలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం పెడుతున్నాం. అక్రమాలు జరగకుండా టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశామని అన్నారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకు సీఎం కప్ పోటీలు నిర్వహించాం. త్వరలో జరిగే ఖేల్ ఇండియా పోటీలకు హైదరాబాద్ అతిథ్యం ఇస్తుంది. టీఎస్ ఐపాస్ ద్వారా రూ.1.95లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. మరో 78వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు రాబోతున్నాయి. ప్రఖ్యాత సంస్థలు హైదరాబాద్ జీసీసీలు ఏర్పాటు చేస్తున్నాయి. నగరంలో ఇప్పటికే 355కు పైగా జీసీసీలు పనిచేస్తున్నాయి. అమెజాన్ సంస్థ రాష్ట్రంలో 7 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతోంది. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే ఉక్కు సంకల్పంతో ఉన్నాం. మహిళలను ఆర్టీసీ అ÷-దదె బస్సులకు యజమానులుగా చేశాం. 15 లక్షలకు పైగా కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేశాం. రెండో విడత కొత్త రేషన్ కార్డుల పంపిణీ ఇవాళే ప్రారంభించుకుంటున్నాం. వృద్ధ తల్లిదండ్రుల కోసం చట్టం చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ అని సీఎం వివరించారు.

# స్మార్ట్ రేషన్‌కార్డులపై సీఎం, మంత్రుల ఫొటోలెందుకు?

(మొదటిపేజీ తరువాయి)

"తెలంగాణలో 57 లక్షల కార్డులకు దాదాపు 2 కోట్ల మందికి కేంద్రం ఉచితంగా బియ్యం అందిస్తోంది. మరి మోదీ ఫొటో ఎందుకు పెట్టడం లేదు? భారాస పాలనలోనూ ఇదే పరిస్థితి. పంచాయతీల అభివృద్ధికి కేంద్రం నిధులిస్తే.. భారాస నాటకాలాడింది. రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితా పేరుతో దోపిడీ కొనసాగుతోంది. ప్రభుత్వం అమ్మిన, హెచ్ఎండీఏ వేలం వేసిన పరిశ్రమలకు విక్రయించిన భూములనూ 22ఏలో ఎలా పెడతారు? ఈ సమస్యను రెండున్నరేళ్లుగా కాంగ్రెస్ ఎందుకు పట్టించుకోవడం లేదు? ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా ప్రజల్ని మోసగిస్తున్న సర్కారుపై యువత ఆలోచించాలి. 12 ఏళ్లలో తెలంగాణకు రూ.13 లక్షల కోట్లు ఖర్చు చేసిన ఘనత ప్రధాని మోదీది. బుల్లెట్ ట్రైన్ కారిడార్ కోసం రాష్ట్రంలో మరో రూ.1.5 లక్షల కోట్లు ఖర్చు చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది" అని పేర్కొన్నారు.



# గోల్కొండ కోటలో త్రివర్ణపతాకం రెపరెప

**తొలిసారి పూర్తిస్థాయి వందేమాతర గీతాలాపన**

**హైదరాబాద్, ఆగస్ట్ 15 :** గోల్కొండ కోటలో 80వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. గోల్కొండ కోటపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఇక, గోల్కొండ కోటపై తొలిసారిగా 'వందేమాతరం' గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా కోట ప్రాంగణం దేశభక్తి నినాదాలతో మార్మోగింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రజలందరికీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. స్వాతంత్ర్య వేడుకలు ప్రజల్లో నూతన ఉత్సాహం, చైతన్యం నింపాలన్నారు. అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణానికి కొత్త ఊపునివ్వాలని ఆకాంక్షించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుతూ దేశభక్తి, పరస్పర గౌరవం పెంపొందించాలని అన్నారు. అసమానతలు లేని శాంతియుత, సౌభ్రాతృత్వ భారతదేశాన్ని నిర్మించాలని తెలిపారు. సమరయోధుల త్యాగాలకు అదే నిజమైన నివాళి అని సీఎం వ్యాఖ్యానించారు. సమన్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వంతో 80వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోవాలని ఆకాంక్షించారు. నవ భారత నిర్మాణంలో ప్రతి పౌరుడు కర్తవ్యనిష్టతో ముందుకు సాగాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# ప్రజల అవసరాలు గుర్తించి సంక్షేమ పాలన

**అన్ని వర్గాలకు న్యాయం చేయడం కోసం కృషి**

**స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో డిప్యూటీ సీఎం భట్టి**



**ఖమ్మం,ఆగస్ట్15:** తెలంగాణ ప్రజల అవసరాలే పరమావధిగా ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ పాలనలో మహిళలు, విద్యార్థులు, రైతులు సహా అన్ని వర్గాలకూ సంక్షేమం అందుతోందని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీ విషయంలో కాలయాపన చేసిందని విమర్శించారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో నకిలీలను పూర్తిగా అరికట్టేందుకు ఈ కొత్త స్మార్ట్ కార్డులలో ఎన్క్రిప్టెడ్ క్యూఆర్ కోడ్, ప్రత్యేక హోలోగ్రామ్, వాటర్ మార్క్, యూవీ లోగో సహా 9 రకాల పటిష్టమైన భద్రతా ఫీచర్లను పొందుపరిచామని భట్టి అన్నారు. ఈ-పాస్ యంత్రాలతో బయోమెట్రిక్ విధానాన్ని అనుసంధానించి రేషన్ పంపిణీలో నూరు శాతం పారదర్శకతను తీసుకువస్తున్నామన్నారు. “రాష్ట్రంలోని ప్రతి నిరుపేద కుటుంబానికి ఆహార భద్రత కల్పించడమే లక్ష్యంగా 3.42 కోట్ల మందికి నెలకు 6 కిలోల చొప్పున సన్న బియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నాం. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఈ సరికొత్త డిజిటల్ కార్డులు మంజూరు చేస్తూ, వాటి ద్వారా అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నాం. పేదలకు మెరుగైన వైద్యం కోసం రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడంతో పాటు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల ద్వారా సొంతింటి కల సాకారం, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం వంటి పథకాలతో ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే మన ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు. తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలతోనే కాకుండా, ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లడమే మన ప్రభుత్వం అడుగులు వేస్తోందని భట్టి తెలిపారు. మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని భట్టి చెప్పుకొచ్చారు. విద్యా రంగంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించేందుకు చర్యలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, అన్నదాతల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. రైతు భరోసాతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. రైతులకు అండగా నిలుస్తూ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. తెలంగాణ ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్నామని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలతోనే కాకుండా ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం స్మార్ట్ రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులకు భట్టి విక్రమార్క శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు సంక్షేమ పథకాల ఫలాలు మరింత సమర్థవంతంగా అందేలా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన హామీ ఇచ్చారు.



## జగ్గారెడ్డి హనుమంతుడిలాంటి వాడు

**సీఎం రేవంత్ ఆసక్తికర వ్యాఖ్యలు**

**సంగారెడ్డి,ఆగస్ట్15:** జగ్గారెడ్డి లాంటి ప్రజాప్రతినిధిని దూరం చేసుకోవడం ప్రజలు చేసుకున్న దురదృష్టమని సీఎం రేవంత్ అన్నారు. పదవులతో సంబంధం లేకుండా ప్రజల్లో ఉండే నేత జగ్గారెడ్డి అని ప్రశంసించారు. కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా సంగారెడ్డిలో సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన ప్రసంగం ముగించే సమయంలో సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిపై ప్రశంసలు కురిపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాముడైతే.. జగ్గారెడ్డి హనుమంతుడులాంటి వారని వ్యాఖ్యానించారు. ఓడిపోయినా ప్రజల మధ్యే జగ్గారెడ్డి తిరుగుతున్నారంటూ ప్రశంసించారు. రూ.వెయ్యి కోట్లు ఇచ్చినా జగ్గారెడ్డి లాంటి నాయకుడు దొరకరు. ఆయన్ను ఓడించడం మీ దురదృష్టం. కుటుంబాన్ని కూడా వదిలేసి ప్రజల కోసం తిరిగే నేత. నాయకులకు మార్కులు వేస్తే.. నాకన్నా మంచి మార్కులు జగ్గారెడ్డికే వస్తాయి. ఇక్కడుంచి జరుగుతుందో నాకు తెలియదు గానీ.. జగ్గారెడ్డి ప్రజాజీవితంలో ఉండాలి'అని సీఎం వ్యాఖ్యానించారు.

## ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడి

**పాడైన ఆహార పదార్థాల తయారీ గుర్తింపు**

**రంగారెడ్డి,ఆగస్ట్15:** కల్తీ ఆహార తయారీ కేంద్రంపై హెచ్‌ఫాస్ట్, జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేశారు. జిల్లాలోని బొంగుళూరులో ఫుడ్ ప్రొడక్ట్స్‌పై జరిపిన తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. గడువు ముగిసిన ముడిసరుకులతో ఆహార పదార్థాలను తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. లేబుల్ లేని రసాయన సువాసన ద్రవ్యాలతో నాసిరకం ఆహారాన్ని తయారు చేస్తున్నట్లు తేలింది. నిర్వాహకులు అత్యంత అపరిశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాలను తయారీ చేస్తున్నట్లు అధికారుల దాడుల్లో బయటపడింది. వ్యాపారంలో లాభాలు రాకపోవడంతో ఈజీ మనీ కోసం అక్రమాలు నాణ్యత లేని ఆహారపదార్థాల తయారీకి ప్లాన్ చేసినట్లు గుర్తించిన అధికారులు.. తనిఖీల అనంతరం యజమాని మహ్మద్ ఖలీద్, మేనేజర్ సంతోష్ కుమార్‌ను అరెస్ట్ చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడుల్లో దాదాపు 4.07 లక్షల విలువైన ఆహార పదార్థాలు, ముడిసరుకు స్వాధీనం చేసుకున్నారు. ముడిసరుకు గడువు ముగిసిన ఫ్లేవర్లు, కాజూ, కొబ్బరి పొడి తదితర పదార్థాలను సీజ్ చేసిన అధికారులు.. నిందితులపై ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

## టీహెచ్‌డీసీ సొరంగ ప్రమాదం

**ఎనిమిదికి చేరిన మృతుల సంఖ్య**

**ఉత్తరాఖండ్, ఆగస్ట్ 15:** చమోలి జిల్లా పిపల్‌కోటిలోని టీహెచ్‌డీసీ సొరంగంలో శుక్రవారం భారీ ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు బిర్హి నది సమీపంలో కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో నిర్మాణంలో ఉన్న సొరంగంలోకి పెద్దఎత్తున వరదనీరు, శిథిలాలు వచ్చి చేరాయి. ఈ ప్రమాదంలో ఏడుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోగా.. మరో ముగ్గురు శిథిలాల కింద చిక్కుకుపోయారు. వారి కోసం సహాయక బృందాలను అధికారులు రంగంలోకి దించారు. భారీగా చేరిన నీరు, శిథిలాలను తొలగిస్తూ.. శనివారం మరో మృతదేహాన్ని వెలికితీశారు. దీంతో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరింది. మరోవైపు, శిథిలాల కింద చిక్కుకుపోయిన మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి స్పందించారు. టీహెచ్‌డీసీ సొరంగంలోకి అకస్మాత్తుగా శిథిలాలు, నీరు చేరడంతో విధుల్లో ఉన్న కార్మికులు చిక్కుకుపోయారని తెలిపారు. ఈ ప్రమాదంలో ఏడుగురు మృతిచెందగా.. చిక్కుకుపోయిన కార్మికుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, ఉత్తరాఖండ్ ప్రభుత్వ జిల్లా యంత్రాంగంతో సహా అన్ని ఏజెన్సీలు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని ఆయన వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే, ఈ ప్రమాదానికి కచ్చితమైన కారణాన్ని తెలుసుకునేందుకు సమగ్ర దర్యాప్తు జరుగుతోందని సీఎం పుష్కర్ సింగ్ ధామి చెప్పారు.

## రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థిని మృతి

**హైదరాబాద్,ఆగస్ట్15:** ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వందన హోటల్ సమీపంలో స్కూటీని వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో ఓ ఇంటర్ విద్యార్థిని దుర్మరణం చెందింది. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వారాసిగూడకు చెందిన సురేష్ తన భార్య, కుమార్తె శ్రావణితో కలిసి స్కూటీపై సొంత గ్రామానికి వెళ్తున్నారు. వందన హోటల్ సమీపంలోకి చేరుకోగానే వెనుక నుంచి వచ్చిన లారీ వారి స్కూటీని బలంగా ఢీకొట్టింది. ఈ క్రమంలో శ్రావణి రోడ్డుపై పడిపోగా.. ఆమెపై నుంచి లారీ వెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలు ఇంటర్ చదువుతున్నట్లు సమాచారం. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న ఘట్కేసర్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు

- ప్రజాప్రభుత్వం రాగానే కార్డులు అందచేశాం
- ప్రతి వ్యక్తికి 6 కిలోల సన్నబియ్యం అందిస్తున్నాం
- స్మార్ట్ కార్డుల పంపిణీలో మంత్రి పొన్నం ప్రభాకర్

**సిద్దిపేట,ఆగస్ట్15(ఆర్ఎన్ఎం):** ప్రజా పాలనలో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి 16 లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశాం. ఇది నిరంతర పక్రియగా 365 రోజులు కొనసాగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రేషన్ కార్డుతో పాటు ప్రతి వ్యక్తికి 6 కిలోల సన్నబియ్యం అందిస్తున్నాం. గ్రామాలు, మండలాల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని పండుగ వాతావరణంలో నిర్వహించాలని అధికారులకు సూచించాం. కొత్తగా రేషన్ కార్డులు పొందిన కుటుంబాల ఆనందం ప్రభుత్వానికి మరింత ప్రేరణనిచ్చే అంశంగా నిలుస్తోంది. సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ప్రారంభించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నేడు సిద్దిపేటలో లాంఛనంగా ప్రారంభించుకుంటున్నాం అని అన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సబ్సిడీ, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త పెన్షన్లు వంటి పథకాలను అమలు చేస్తున్నాం. రాష్ట్రంలో 2.5 లక్షల కొత్త పెన్షన్లు మంజూరు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. 70 వేలకు పైగా ఉద్యోగాలు కల్పించడంతో పాటు మరిన్ని ఉద్యోగ నోటిఫికేషన్లు రాబోతున్నాయి. మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ వంటి అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు. సిద్దిపేట పట్టణంలోని వైశ్య కన్వెన్షన్ భవనంలో లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగింది కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమవతి ,అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్ , పద్మశాలి ఫెడరేషన్ చైర్మన్ గూడూరి శ్రీనివాస్ ,లైబ్రరీ చైర్మన్ ధరిపల్లి చంద్రం , ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య, ఆర్టీఏ మెంబర్ సూర్య వర్మ , మార్కెట్ కమిటీ చైర్మన్ లు ,వివిధ గ్రామాల సర్పంచ్ పాల్గొన్నారు.

## సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు

**రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా విడుదల**

**ఎమ్మెల్యే పాయంతో కలసి విడుదల చేసిన మంత్రి తుమ్మల**

**భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్ట్15:** ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సరిగ్గా లేక పంటల సాగుకు ఇబ్బందులు ఏర్పడ్డాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలు.. సాగర్ ఆయకట్టుకు భరోసాగా మారిందన్నారు. మారేళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని నెలాఖరులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నీళ్ల దగ్గర రాజకీయాలు చేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. రాజీవ్ లింక్ కెనాల్‌కు గోదావరి జలాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విడుదల చేశారు. శనివారం అశ్వాపురం మండలం సీతారామ పంప్ హౌస్ వద్ద మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.. మోటార్ స్విచ్ ఆన్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతులు ఎవరూ కూడా దిగులు పడొద్దని.. మీ భూముల్లో పైప్‌లైన్ వేసిన మరలా పూడ్చి ఇస్తామని మంత్రి చెప్పారు. యధావిధిగా మళ్లీ వ్యవసాయం చేసుకోవచ్చని అన్నారు. పినపాకకి నీళ్లు ఇవ్వకుండా ఖమ్మంకి తీసుకెళ్లటం బాధగా ఉందన్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా.. ఎవరు ఎటువంటి రాజకీయాలు చేసినా నెలాఖరుకు మారేళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.



## బేగంబజార్‌లో సోనూసూద్ సందడి

**హైదరాబాద్,ఆగస్ట్15:** భగత్‌సింగ్ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు లడ్డు యాదవ్ ఆధ్వర్యంలో శనివారం భారీ తిరంగా బైక్ ర్యాలీని నగరంలో నిర్వహించారు. ఈ ర్యాలీలో ప్రముఖ బాలివుడ్ నటులు సోను సూద్ పాల్గొన్నారు. బేగంబజార్ ఛత్రి చౌరస్తాలో ఏర్పాటు చేసిన స్వాగత వేదికపై సోను సూద్ మాట్లాడారు. బేగంబజార్‌తో తనకు ఎంతో అనుబంధం ఉందని పేర్కొన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలని కోరారు. అవసరమైతే ఆదుకునేందుకు తాను సిద్దమని స్పష్టం చేశారు. లడ్డు యాదవ్ ఆధ్వర్యంలో తిరంగా బైక్‌ర్యాలీ నిర్వహించడం, భారీ సంఖ్యలో యువత తరలి రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురు వికలాంగులకు వీల్ చైర్‌లు, అనాథ విద్యార్థులకు పాఠశాల బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పవన్‌సింగ్, అజయ్ అగర్వాల్, రోమల్ సింగ్, దినేష్ యాదవ్, గురుసింది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణపై ఏపీ నీటి కుట్రలు

**కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్‌కు లేఖ దుర్మార్గం**

**మండిపడ్డ మాజీమంత్రి శ్రీనివాస గౌడ్**

**హైదరాబాద్,ఆగస్ట్15:** తెలంగాణ నీటిపై ఏపీ మళ్లీ కుట్రలు మొదలు పెట్టిందని మాజీ మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్ ఫైర్ అయ్యారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ..ఆంధ్రప్రదేశ్ ఈఎన్‌సీ చైర్మన్ కృష్ణారివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకి లేఖ రాశాడు. ఆయన వాళ్ల రాష్ట్రం గురించి మాట్లాడాలి కానీ తెలంగాణ రాష్ట్రానికి కృష్ణా రివర్ బేసిన్‌లో ఉన్న ప్రాంతానికి కేవలం 30 టీఎంసీల నీళ్లు మాత్రమే ఇవ్వాలని.. అంటే 30 శాతం మాత్రమే తెలంగాణకు ఇవ్వండి.. మిగితా నీళ్లు మేం తీసుకుపోతం. అంటే 146 టీఎంసీలు మేం తీసుకెళ్తం.. 30 టీఎంసీలు తెలంగాణ వాళ్లకు ఇచ్చేయండి అని.. ఆయన ఎవరు... తెలంగాణ గురించి రాయడానికి నీకు ఎవరు అధికారం ఇచ్చిండన్నారు. 100 శాతం కృష్ణా బేసిన్‌లో ఉన్న ప్రాంతాన్ని వదిలిపెట్టి నువ్వు కృష్ణా బేసిన్ నుంచి పెన్నా బేసిన్‌కు కృష్ణా రివర్‌కు 80–90 శాతం నీళ్లు తీసుకుపోతున్నరు. పోతిరెడ్డి పాడు ద్వారా 10 వేల క్యూసెక్కులు అని చెనప్పి 30 వేల క్యూసెక్కుల నీళ్లు తీసుకెళ్లి ఆ ప్రాంతంలో నింపుకుంటున్నరని ఆరోపించారు. తెలంగాణకు ఎన్ని నీళ్లు ఇవ్వాలో డిసైడ్ చేయడానికి వాడు ఎవడు..? ఏపీ ఈఎన్‌సీ లేఖ రాసిన రోజే తెలంగాణ ఈఎన్‌సీ కూడా లేఖ రాశాడు. మాకు కృష్ణా నదిపై రిజర్వాయర్లు లేవు, నీటిని ఏపీకి ఇబ్బంది లేకుండా ఇవ్వాలని తెలంగాణ ఈఎన్‌సీ లేఖ రాశాడు.. ఏదుల, నార్లాపూర్ రిజర్వాయర్లు లేవా..? 10 ఏళ్లలో తెలంగాణ నీటిపై లేని కుట్రలు మళ్లీ ఎందుకు మొదలవుతున్నాయి..? తెలంగాణ ప్రభుత్వం చేతకానిది అనే కదా..? ఏపీ మోచేతి కింద బతుకుతుందనే కదా..? తెలంగాణకు అన్యాయం చేసే అధికారులను వదిలి పెట్టము, జాగ్రత్త అని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. తెలంగాణ ఈఎన్‌సీకి లేఖ రాయమని ఎవరు చెప్పారు..? రేవంత్ రెడ్డి చెప్పాడా..? అని అడిగారు.

## గ్యాస్ ఈకెవైసికి నేటితో ముగియనున్న గడువు

**హైదరాబాద్,ఆగస్ట్15:** గ్యాస్ వినియోగదారులు తప్పనిసరిగా ఈకేవైసీని చేసుకోవాలని, ఈనెల 16వ తేదీ సాయంత్రంతో గడువు ముగియనుంది. పలు కంపెనీలకు చెందిన గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు వినియోగదారులకు మెసేజ్‌లు, ఫోన్‌లు చేసి ఈకేవైసీని తప్పనిసరిగా చేసుకోవాలని, లేకుంటే గ్యాస్ రాదని స్పష్టంగా తెలియజేస్తున్నారు. ఇలా చేయకపోతే సబ్సిడీ రద్దవు తుందని, ఆంక్షలు విధించే అవకాశ ముందని పలువురు చర్చించుకుంటున్నారు. దీంతో గ్యాస్ ఏజెన్సీల వద్దకు ఈకేవైసీని చేసుకునేందుకు వినియోగదారులు క్యూకట్టారు. అయితే శనివారం స్వాతంత్య దినోత్సవం, ఆదివారం సెలవులు కావడంతో ప్రజలు సందేహంలో ఉన్నారు. ఏజెన్సీల నిర్వాహకులను వివరణ కోరగా.. శని, ఆదివారం వర్కింగ్ డేగా ఉందని తెలుస్తోందని, పై నుంచి తేదీని పెంచితే సెలవు ఉంటుందని తెలుపుతున్నారు. త్వరితగతిన ఏజెన్సీల వద్దకు వెళ్లి ఈకేవైసీ చేసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

## హైదరాబాద్ చంపాపేటలో విషాద ఘటన

**అన్నను చంపి.. తమ్ముడు పరార్**

**హైదరాబాద్, ఆగస్ట్ 15:** నగరంలోని చంపాపేట కుమ్మరి బస్తీలో శనివారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కుటుంబ తగాదాల కారణంగా సొంత తమ్ముడే కసాయిగా మారి, కత్తెరతో పొడిచి సొంత అన్నను అత్యంత దారుణంగా హత్య చేసిన ఘటన కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చంపాపేట కుమ్మరి బస్తీలో నివాసముంటూ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న ముదావత్ వెంకటేష్ (28)కు, పక్క వీధిలోనే నివసిస్తున్న అతడి తమ్ముడు శివ (26)తో గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. వీరి తండ్రి మరణించిన నాటి నుంచి అన్నదమ్ముల మధ్య కుటుంబ విషయాల్లో వివాదాలు మరింత తీవ్రస్థాయికి చేరాయి. ఈ క్రమంలోనే శనివారం అన్నదమ్ముల మధ్య మరోసారి తీవ్రస్థాయిలో ఘర్షణ చోటుచేసుకుంది. ఆవేశానికి గురైన తమ్ముడు శివ, ఇంట్లోని కత్తెర తీసుకుని అన్న వెంకటేష్‌పై విచక్షణారహితంగా దాడి చేసి పొడిచేశాడు. తీవ్రంగా గాయపడిన వెంకటేష్‌ను గమనించిన స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. అయితే, మార్గమధ్యలోనే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అన్నను పొడిచిన అనంతరం నిందితుడు శివ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న సరూర్ నగర్ పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పరారీలో ఉన్న నిందితుడు శివ కోసం గాలింపు చర్యలు వేగవంతం చేశారు.

## భాగ్యలక్ష్మి ఆలయం వద్ద లక్షమందితో వందేమాతరం

**దమ్ముంటే అడ్డుకోవాలని ఎంఐఎంకు బండి సవాల్**



**హైదరాబాద్,ఆగస్ట్15:** పాతబస్తీ భాగ్యలక్ష్మి ఆలయం వద్ద లక్షలాది మందితో సామూహిక వందేమాతరం గీతాలాపన చేయిస్తానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఎంఐఎం నేతలారా.. దమ్ముంటే అడ్డుకోండని సవాల్ విసిరారు. వందేమాతరం గీతాన్ని అవమానిస్తే 3 ఏళ్ల జైలు శిక్ష, జరిమానా తప్పదన్నారు. చట్ట ప్రకారం వ్యవహరించే తమను మతతత్వవాదులంటారా అని మండిపడ్డారు. స్మార్ట్ రేషన్ కార్డులపై సీఎం, మంత్రుల ఫోటోలు ఎందుకని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మితే ఊడిపోయేదని ఎద్దేవా చేశారు. కర్ణాటకలో సిద్ధరామయ్య హయాంలో రూ.వందల కోట్లతో తయారుచేసిన స్మార్ట్ కార్డులన్నీ నిరుపయోగమయ్యాయని గుర్తు చేశారు. తెలంగాణలో దాదాపు 2 కోట్ల మందికి కేంద్ర ప్రభుత్వం ఉచితంగా బియ్యం ఇస్తోందన్నారు. రేషన్ కార్డులపై మోదీ ఫొటో ఎందుకు పెట్టడం లేదో చెప్పాలన్నారు. కేంద్రం ఇచ్చే బియ్యం మీకు అవసరం లేదా అని ప్రశ్నించారు.

## చరిత్ర తెలుసుకుంటేనే.. భవిష్యత్ నిర్మాణం

**టిఆర్ఎస్ కార్యాలయంలో జెండా ఆవిష్కరణలో కవిత**



**హైదరాబాద్,ఆగస్ట్15:** చరిత్రను తెలుసుకున్న వాళ్లే భవిష్యత్తును చక్కగా నిర్మించగలరని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత అన్నారు. టీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయంలో 80వ స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ... బ్రిటీష్ పాలనలో జరిగిన అఘాయిత్యాలు, విభజించి పాలించిన విధానం అందరికీ తెలియాల్సిన అవసరం ఉందన్నారు. రెండు ప్రపంచ యుద్ధాలకు భారతీయులను సైనికులుగా వాడుకొని ఎంతో మంది చావులకు కారణమయ్యారని మండిపడ్డారు. బ్రిటీష్ వాళ్లు వచ్చిన తర్వాతే కుల వ్యవస్థ మరింత పెరిగిందని వ్యాఖ్యానించారు. అడవుల్లో ఉండే ఆదివాసీలను రాజ్యం పరిధిలోకి తెచ్చి తీరని అన్యాయం చేశారన్నారు. బ్రిటీష్ పరిపాలన పోయినప్పటికీ వాళ్ల ఆలోచనా విధానాన్నే ఇప్పటికీ అమలు చేస్తున్నారని కవిత విమర్శించారు. ఇంగ్లీష్ మాట్లాడిన వాళ్లే గొప్ప అన్నట్లుగా చూస్తున్నారని.. తెలుగు భాష మాట్లాడితే తక్కువ చేసి చూస్తున్నారని మండిపడ్డారు. 'తెల్ల తోలు గొప్ప, నల్ల తోలు కాదన్నట్లుగా ప్రచారం చేసి మనలో మనల్ని శత్రువులను చేశారు' అని అన్నారు. ఆనాటి బ్రిటీష్ వాళ్ల పరిపాలన, ఆలోచనా విధానాన్ని వీడాలని కవిత పేర్కొన్నారు.



## పేదల పెన్నిది మా సర్కార్

**స్మార్ట్ కార్డుల పంపిణీలో మంత్రి పొంగులేటి**

**హనుమకొండ, ఆగస్ట్ 15:** పేదల ముఖంలో చిరునవ్వు చూడటమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం ఎంపీ డాక్టర్ కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజు, కలెక్టర్ చాహాత్ బాజ్ పాయిలతో కలిసి లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. రేషన్ కార్డు అనేది కేవలం ఒక గుర్తింపు పత్రం కాదని, పేద కుటుంబాలకు ఆహార భద్రతతోపాటు అనేక సంక్షేమ పథకాలకు ఆధారమని పేర్కొన్నారు.

# హుందాతనం కోల్పోతున్న రాహుల్!



**రాజకీయాల్లో హుందాతనం అవసరం. సమయానుకూలంగా మంచిగా మాట్లాడేలా వ్యవహరించాలి. సమస్యలపై అవగాహన ఉండాలి. అందులోనూ ప్రతిపక్షనేతగా ఉన్న వ్యక్తికి ఇవన్నీ అవసరం. ప్రతిపక్ష నేతగా సమర్థత ఉంటేనే రాణిస్తారు. అధికారంలో ఉన్నప్పుడు ఎలాగైనా చెల్లుతుంది. కానీ ప్రతిపక్షనేతగా రాణించాలంటే ప్రజల్లో తన వ్యక్తిత్వం కూడా పెంచుకోవాల్సి ఉంటుంది. మాటలు, చేతలు అన్నీ హుందాగా ఉండేలా చూసుకోవాల్సి ఉంటుంది. లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ ఈ మధ్య మరీ దిగజారి పోయారు. మాటల్లో హుందాతనం లేదు. చేతల్లో అంతకన్నా లేకుండా పోయింది. సర్కస్‌లో జోకర్‌లా, డ్రామాల్లో విదూషకుడిలా ఆయన ప్రవర్తిస్తున్న తీరు జుగుప్స కలిగిస్తోంది. లోక్‌సభలో మాట్లాడాల్సిన సమయంలో మాట్లాడరు. మాట్లాడితే పస ఉండడం లేదు. సమస్యలపై అవగాహన ఉండడం లేదు. విషయంపై పట్టు ఉండడం లేదు. ఇవన్నీ కలగలిపి రాహుల్ గాంధీ విపక్ష నేతగా పూర్తిగా విఫలం అవుతూ వస్తున్నారు.**

ఇటీవల వరుసగా పార్లమెంట్ సమావేశాలు దెబ్బతినడానికి ప్రధాన కారణం కూడా రాహుల్ అన్న విషయం మరచిపోరాదు. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఆయన ఎంతగా దిగజారిపోయారో అనడానికి నిదర్శనంగా నిలిచాయి. ఆలింగనాలే ప్రధాన మంత్రి మోదీ విదేశీ దౌత్యం అంటూ... లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు..ఆయన ఆహార్యం సామాన్యులకు కూడా వెగటు పుట్టించేలా ఉన్నాయి. అహంకారం హద్దులు దాటి రాహుల్ నోరుజారుతున్నారనడానికి ఇంతకన్నా నిదర్శం అక్కర్లేదు. ఇది ఓ రకంగా భారత ప్రతిష్ఠను దిగజార్చేలా ఉంది. ఇలాంటి ప్రతిపక్ష నేతను గతంలో ఎప్పుడూ చూడలేదని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేసిన వ్యాఖ్యలు ముమ్మాటికీ నిజం. ఎందుకంటే భారత దౌత్యంపై రాహుల్ చేసినవి దిగజారుడు వ్యాఖ్యలు చూశాక ఇలాంటి ప్రతిపక్ష నేత ఉన్నందుకు దేశ ప్రజలు సిగ్గుపడాలి. ఆయన ప్రవర్తన ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. రాహుల్ వ్యాఖ్యలు విదేశాల్లో భారత్ ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నాయి. ఎందుకంటే రాహుల్ అహంకారంతో చేసిన వ్యాఖ్యలు వ్యవహరిం చిన తీరు పిచ్చిగా మారుతోందనడానికి చెప్పడానికి సిగ్గుపడాల్సిన పనిలేదు. భావి భారత ప్రధాని అని కాంగ్రెస్ శ్రేణులంతా పొగడుతు న్న వేళ..ఆయన భాషను, ఆహార్యాన్ని చూస్తుంటే..ఇతనూ ఒక నేతేనా అన్న సందేహం కలుగక మానదు. ఇలాంటి వారిచేతిలో భారత్ పదిలంగా ఉండగలదా అన్న భయం కలుగుతోంది. భారతదేశాన్ని నడపడానికి సుదీర్ఘ అనుభవం కావాలి. పనికిమాలిన నాటకాలు కాదు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని జోకర్లని పిలవడం, మోడీని, అమిత్ షాలను కట్టగట్టి తిట్టడం పరిధికి మించిన విషయం.

రాహుల్ వాడుతోన్న భాష మూర్ఖత్వాన్ని, నిరాశను తెలిజేస్తున్నాయి. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీని ఉద్దేశించి రాహుల్ చేసిన వ్యాఖ్యలు దిగజారుడు రాజకీయాలకు పరాకాష్టగా చెప్పుకోవాలి. అలాగే విదేశాల్లో వివిధ నేతలతో మోడీ ఆలింగనాలపైనా కువ్యాఖ్యలు చేశారు. నిజానికి ఓ ప్రతిపక్షనేతగా ఉన్న వ్యక్తి విదేశీ నాయకులపై రాజకీయ వ్యాఖ్యలు చేసేటప్పుడు గౌరవప్రదమైన వైఖరి ప్రదర్శించాల్సి ఉంటుంది. తానొక విపక్షనేతను అన్నది మరచి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆయన దిగజారుడు రాజకీయాలకు పారాకాష్టగా చూడాలి. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర తరవాత ఆయన నాయకత్వం పట్ల ప్రజల్లో కొంత విశ్వసనీయతను పెంపొందించిందనడంలో సందేహం లేదు. ఆ యాత్రతో ఆయన ప్రజల మనిషిగా మారడానికి తపించారు. అయితే సార్వత్రిక ఎన్నికల అనంతరం కాంగ్రెస్‌ను మళ్లీ ఒక కుటుంబ వ్యవస్థగా మార్చేయడంతో భారత్ జోడో యాత్ర నాటి ఆదర్శం లేకుండా పోయింది. ఇప్పుడు జన్‌జీ అంటూ మాట్లాడుతున్న రాహుల్ వారికి పార్టీలో అవకాశం ఇవ్వలేక పోయారు. ప్రియాంకగాంధీని వయనాడ్ నుంచి లోక్‌సభకు ఎన్నిక చేయించుకున్నారు. తల్లి సోనియాను రాజ్యసభకు పంపారు. తాను రాయబరేలి నుంచి ఎన్నికయ్యారు. ఇది కుటుంబ పార్టీ అనకుండా ఎలా ఉండగలం. వృద్ధనేతలంతా కాంగ్రెస్‌లో పాతుకు పోయారు. యువ నేతలను దరిచేరనీయకుండా చూసుకుంటున్నారు. వీరు జన్‌జీ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉంది. తాను దక్షిణాదికి ప్రాతినిధ్యం వహిస్తున్నానని, తన సోదరుడు ఉత్తరాదికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడని, తద్వారా తాము ఈ సువిశాల దేశాన్ని సమైక్యం చేస్తున్నామని ప్రియాంక చెప్పుకోవడం సిగ్గుచేటు. 2024 సార్వత్రిక ఎన్నికలలో 99 సీట్లు గెలుచుకుని కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఆవిర్భవించడంతో రాహుల్ విధేయులు ఆయనను కాబోయే ప్రధానమంత్రి అని కీర్తించడం ప్రారంభించారు. కొందరు మేధావులు, పాత్రికేయులు కూడా ఆ కీర్తనకు వంతపాడుతూ వచ్చారు. రెండు సంవత్సరాల తరువాత ఇప్పుడు వెనుతిరిగి చూస్తే అంత సీన్ రాహుల్‌కు లేదని అనిపిస్తోంది.

తాజాగా రాహుల్ చేష్టలు, వ్యాఖ్యలు ఆయనలో నాయకత్వ పటిమ లేదని నిరూపించాయి. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ క్రమంగా వెనుకపడిపోతోంది. కాంగ్రెస్ పతనాన్ని రాహుల్‌గాంధీ నిలువరించలేక పోతున్నారు. ప్రధానమంత్రి పదవి విషయంలో నరేంద్ర మోదీతో పోలిస్తే .. రాహుల్‌లో క్రమశిక్షణ, హుందాతనం, విద్యార్హతలు, నాయకత్వ నైపుణ్యాలు ఎక్కడా కనిపించవు. సమయానుకూలంగా ఏదో ఓ సమస్యపై మాట్లాడడం, విదేశాలకు చెక్కేయడం అలవాటు చేసుకున్నారు. అక్కడా భారత పరువు పోయేలా మాట్లాడడం కూడా అలవాటు చేసుకున్నారు. 'ఓటు చోరీ'పై ఇలాగే చేశారు. ప్రతిపక్ష నేతగా ప్రధాని కన్నా ఎక్కువ కష్టపడాలి. ఎక్కువగా కృషి చేయాలి. యూపీఏ అధికారంలో ఉన్న పది సంవత్సరాలలో రాహుల్ మంత్రిపదవిని చేపట్టేందుకు అంగీకరించలేదు. దీంతో ఆయనకు అధికారంలో ఉండడం ఎలా అన్నది కూడా తెలియదు. ప్రస్తుత కల్లోల అంతర్జాతీయ పరిస్థితులలో ఈ సువిశాల దేశానికి ప్రభావశీల ప్రధానమంత్రి కాగలరని భారతీయ ఓటర్లు మాత్రం ఎలా నమ్ముతారు. గతంలో చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోలేని రాహుల్, ఇప్పటికీ పదేపదే అవే తప్పులు చేయడంతో పాటు, రాజకీయ హుందాను కోల్పోతున్నారు. 2019లో మోదీకి వ్యతిరేకంగా రాహుల్ నిర్వహించిన 'చౌకీదార్ చోర్' ప్రచారం ఘోరంగా విఫలమవడమే కాకుండా కాంగ్రెస్‌నే ఎదురు దెబ్బతీసింది. అయినప్పటికీ పాలనా వైఫల్యాలు లేదా తన సొంత పార్టీని గ్రామస్థాయి నుంచి పటిష్ఠం చేయడంపై దృష్టి పెట్టకుండా ప్రధాన మంత్రిపై వ్యక్తిగత విమర్శలు చేయడం ద్వారా మరింతగా దిగజారిన నేతగా ప్రజల్లో చులకన భావం మూటకట్టుకుంటున్నారు. ఇలాంటి వ్యక్తి నిజసానికి ప్రతిపక్ష నేతగా కూడా పనికిరాడు. ఇక ప్రధానిగా కావాలనుకంటున్న ఇతనికి వందిమాగధులు చేస్తున్న పొగడ్తలతో ఉబ్బిపోవడం తప్ప మరోటి తెలియడం లేదు. స్వయం ప్రకటితంగా ఇక తానే భావి ప్రధాని అనుకోవడంతో వచ్చిన మానసిక వైకల్యంగా చూడాలి. వీటిని అధిగమించితే తప్ప సమర్థనేతగా రాహుల్ రాణించడం కష్టం.

# దేశ భవిష్యత్ ప్రగతికి సరికొత్త దిశానిర్దేశం

- ఆయా రంగాల్లో స్వయంసమృద్ధితో వికసిత భారత్ సాధ్యం
- ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు చోదకశక్తి కావడం తథ్యం
- సప్తధార సందేశం ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 15 :** భారతదేశ 80వ స్వాతంత్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట వేదికగా ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ప్రసంగం దేశ భవిష్యత్తు ప్రగతికి సరికొత్త దిశానిర్దేశం చేసింది. 2047 నాటికి 'వికసిత్ భారత్', స్వయంసమృద్ధి సాధించడమే లక్ష్యంగా, దేశాన్ని నడిపించే ఏడు ప్రాథమిక శక్తులను 'సప్తధార' పేరుతో ఆయన ఆవిష్కరించారు. ఈ ఏడు రంగాలు భారతదేశ రాబోయే ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు చోదక శక్తులుగా నిలుస్తాయని పేర్కొన్నారు. మొదటి ధార మాన్యుఫ్యాక్చరింగ్. దేశ తదుపరి వృద్ధి దశకు మాన్యుఫ్యాక్చరింగ్ బలమైన పునాదిగా మోడీ అభివర్ణించారు. కేవలం చిన్న విడిభాగాల తయారీకే పరిమితం కాకుండా సంపూర్ణ ఉత్పత్తుల తయారీపై భారత్ దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ప్రపంచ సరఫరా వ్యవస్థలో భారత్‌ను ఒక కీలక భాగస్వామిగా నిలబెట్టేందుకు ధర, నాణ్యత, విస్తృత స్థాయి ఉత్పత్తి అనే మూడు అంశాలపై తయారీదారులు దృష్టి పెట్టాలని సూచించారు. మన ఉత్పత్తులకు ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, ఖచ్చితత్వంతో కూడిన నాణ్యత ఐడెంటిటీగా మారాలని చెప్పారు. సప్తధారలో రెండవది వ్యవసాయం, ఆహార భద్రత. దేశ అభివృద్ధి ప్రయాణంలో వ్యవసాయ రంగ ప్రాధాన్యతను నొక్కి చెప్పిన ప్రధాని, ఆర్థిక వృద్ధిలో ఆహార ఉత్పత్తి, వ్యవసాయం ఎప్పటికీ కేంద్రబిందువులుగా ఉంటాయని స్పష్టం చేశారు. సుదీర్ఘకాల ఆహార భద్రతను నిర్ధారించడానికి వ్యవసాయరంగాన్ని బలోపేతంచేసి, ఉత్పాద కతను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతికత, ఆవిష్కరణలు మూడవ ధారగా అభివర్ణించారు. ప్రపంచం డేటాసెంటర్లు, రోబోటిక్స్, సరికొత్త సాంకేతికతల యుగంలోకి అడుగు పెడుతోందని, ఈ రంగాల్లో భారత్ గ్లోబల్ హబ్‌గా మారాలని పిలుపునిచ్చారు. యుపిఐ విజయం ద్వారా భారత్ తన సాంకేతిక సామర్థ్యాన్ని ఇప్పటికే ప్రపంచానికి నిరూపించిందని, ఇప్పుడు మరింత పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకోవాలని చెప్పారు. అలాగే నెక్ట్స్-జెన్ టెలికమ్యూనికేషన్‌ను వేగవంతం చేస్తూ, స్వదేశీ 6ఉ సాంకేతికతను దేశంలోని మూల మూలకూ తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. నాల్గవ ధారగా మౌలిక వసతులు, 'గతి శక్తి' ద్వారా అనుసంధానాన్ని పెంచడంపై మాట్లాడారు. వ్యాపారాన్ని విస్తరించడానికి, ల్యాజిస్టిక్స్ మెరుగు పరచడానికి, వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి రోడ్లు, హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేల అభివృద్ధి అత్యంత కీలకమని, వాటికి నిరంతరం ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఈ వేగవంతమైన కనెక్టివిటీ సరికొత్త ఆర్థిక అవకాశాలను తెరుస్తుందన్నారు.ఐదవ ధారగా 'రక్షా శక్తి' నిలిచింది. రక్షణ రంగంలో దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, స్వదేశీ తయారీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా డ్రోన్లు, కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్ వంటి అత్యాధునిక సైనిక సాంకేతికతలపై ఎక్కువ పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. దేశద్రోహ భద్రతను గట్టిగా ఉంచడానికి ఆత్మనిర్భర్ రక్షణ రంగం ఎంతో అత్యవసరమని తెలిపారు. ఆరవ ధారగా హరిత ఇంధనాన్ని (గ్రీన్ ఎనర్జీ) ప్రధాని గుర్తించారు. పర్యావరణ పరిరక్షణను కాపాడుతూనే భవిష్యత్తు ఇంధన అవసరాలను తీర్చుకోవడానికి క్లీన్ ఎనర్జీ సాంకేతికతల్లో ఆవిష్కరణలు చాలా ముఖ్యం అని చెప్పారు. పునరుత్పాదక ఇంధన రంగాన్ని విస్తరించడానికి, స్వచ్ఛమైన ఇంధన వనరుల వైపు వేగంగా అడుగులు వేయడానికి కృషి చేయాలన్నారు. చివరగా ఏడవ ధారగా భారతదేశం 'సాఫ్ట్ పవర్' ను ప్రధాని ఆవిష్కరించారు. భారత్ సాంస్కృతిక ప్రభావం సరిహద్దులు దాటి విస్తరించిందని చెబుతూ.. యోగా, హస్తకళలు, సినిమాలు, యానిమేషన్, గేమింగ్, డిజిటల్ కంటెంట్, క్రియేటివ్ రంగాలు భారత సాఫ్ట్ పవర్‌కు ప్రధాన స్తంభాలని వెల్లడించారు. భారతదేశ పర్యాటక రంగానికి భారీ అవకాశాలు ఉన్నాయని, విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు మరింత కృషి చేయాలని కోరారు. జాతీయ పార్కులు, సాంస్కృతిక విశేషాలు, వినోద పరిశ్రమ, వేగంగా విస్తరిస్తున్న 'కాన్సర్ట్ ఎకానమీ' పర్యాటకాన్ని బలోపేతం చేయడానికి, భారత్ గొప్ప వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పడానికి అద్భుతమైన వేదికలని మోడీ స్పష్టం చేశారు. ఈ సప్తధార సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, 2047 నాటికి దేశాన్ని సంపూర్ణ స్వయంసమృద్ధి కలిగిన వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఎర్రకోటపై జెండా ఎగరేసిన ప్రధాని మోడీ

- వరుసగా 13వసారి జెండా ఆవిష్కరణ
- తొలిసారిగా పూర్తిస్థాయి వందేమాతర గీతాలపన
- పూలవర్షం కురిపించిన వాయుసేన హెలికాప్టర్లు



**న్యూఢిల్లీ,ఆగస్ట్15 :** దేశవ్యాప్తంగా 80వ స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాజధాని దిల్లీలో ఎర్రకోటపై ప్రధాని మోదీ జాతీయ జెండా ఎగురవేశారు. దిల్లీలోని ఎర్రకోటపై మోదీ వరుసగా 13వ సారి జాతీయ జెండా ఎగురవేశారు. దేశ చరిత్రలో తొలిసారిగా వందేమాతరం గేయాన్ని పూర్తిగా ఈ వేడుకల్లో ఆలపించారు. అనంతరం జాతీయ గీతం 'జనగణవ-ున'ను ఆలపించారు. ఆ సమయంలో వాయుసేన పూలవర్షం కురిపించింది. ఒక హెలికాప్టర్ జాతీయ పతాకాన్ని.. మరొకటి 'వందేమాతరం' అని రాసి ఉన్న జెండాను మోసుకెళ్లాయి. 'వందేమాతరం' గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గతేడాది నవంబర్ 7 నుంచి ఏడాది పాటు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే జాతీయ గీతం 'జన గణ మన'తో పాటు వందేమాతరానికి ప్రభుత్వం సమాన హోదా కల్పిస్తూ చట్టం చేసింది. ఈ చట్టం ప్రకారం.. 'వందేమాతరం'ని అవమానించినా, ఆలపిస్తున్న సమయంలో ఆటంకం కలిగించినా ఇకపై చట్టరీత్యా నేరంగా పరిగణిస్తారు. స్వాతంత్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రముఖ సెర్చ్ ఇంజిన్ సంస్థ గూగుల్ ప్రత్యేక డూడుల్‌ను రూపొందించింది. ఇది భారతీయ వస్త్ర కళలు, సంస్కృతీ సంప్రదాయాలు, వైవిధ్యాన్ని చాటిచెబుతోంది. 22 విభిన్న ప్రాంతీయ వస్త్ర సంప్రదాయాలను తెలియజేసే డిజైన్‌లు అందులో కనిపిస్తున్నాయి. చేతితో నేసిన ఈ వస్త్రాల డూడుల్ దేశవ్యాప్తంగా ఉన్న నేత కార్మికులు, రైతులు, బ్లాక్-ప్రింటర్ల సామూహిక శ్రమను ప్రతిబింబిస్తోంది. జెండా ఎగురవేయడానికి ముందు ప్రధాని మోదీ రాజ్‌ఘాట్ వద్ద మహాత్ముడికి నివాళులు అర్పించారు. అనంతరం ఎర్రకోట వద్ద గౌరవవందనం స్వీకరించి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ వేడుకలు ప్రారంభమైన సమయంలో వాయుసేన పూలవర్షం కురిపించింది. స్వాతంత్య్ర దినోత్సవం రోజున మోదీ జెండా ఎగురవేయడం ఇది 13వసారి కావడం విశేషం. జెండా ఎగురవేసిన అనంతరం ఆయన దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. 'ఈ రోజు మనమంతా 80వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని జరుపుకొంటున్నాం. ప్రతి హృదయంలో 'వందేమాతరం' ధ్వనిస్తోంది. ప్రతి ఇంట్లో త్రివర్ణ పతాకం రెపరెపలాడుతోంది. కొత్త తీర్మానాలతో సరికొత్త ఉత్సాహంతో దేశం ముందుకు సాగుతోంది. గతంలో ఐదు బలహీన దేశాల జాబితాలో ఉన్న భారత్.. 12 ఏళ్ల తర్వాత ఇప్పుడు వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థిక వ్యవస్థగా మారింది' అని మోదీ అన్నారు.



## ప్రత్యేక ఆకర్షణగా మోడీ వస్త్రధారణ

**బాందనీ తలపాగాతో అకట్టుకున్న ప్రధాని**

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 15 :** 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఎరుపు రంగుతో కూడిన సాంప్రదాయ రాజస్థానీ 'బాంధనీ' తలపాగాను ధరించి ఆకట్టుకున్నారు. ఈ తలపాగాకు జతగా తెల్లటి కుర్తా, చాక్లెట్ గోధుమరంగు వెస్ట్‌కోట్ జాకెట్ ధరించారు. దేశభక్తిని చాటేలా జేబులో జాతీయ జెండా రంగులైన కాషాయం, తెలుపు, ఆకుపచ్చతో కూడిన 'పాకెట్ స్క్వేర్'ను ప్రత్యేకంగా అలంకరించుకున్నారు. రాజస్థాన్, గుజరాత్‌లో బాంధనీ వస్త్ర కళకు ప్రత్యేక గుర్తింపు ఉంది. చిన్న చిన్న వస్త్రాలను దారంతో కట్టి (టై-అండ్-డై) రంగులు అద్దే విధానంలో ఈ డిజైన్లు రూపొందుతాయి. ఆ దారాలు తొలగించిన తర్వాత వస్త్రంపై చుక్కలు, ఆకృతులు కనిపిస్తాయి. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మోదీ ధరించే తలపాగాలు ఏటా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. 2025లో ఆయన కాషాయ తలపాగా, తెల్లటి కుర్తాతో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే.

## ఒలంపిక్స్‌లో ప్రతి క్రీడలో భారత భాగస్వామ్యం ఉండాల్సిందే

**ఎర్రకోటపై నుంచి క్రీడాకారులకు ప్రధాని మోడీ పిలుపు**

**న్యూఢిల్లీ,ఆగస్ట్15 :** స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా ఎర్రకోట వేదికగా ప్రధాని మోదీ భారత క్రీడా రంగానికి ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని నిర్దేశించారు. 2036లో జరిగే ఒలింపిక్స్‌లో ప్రతి క్రీడలో భారత భాగస్వామ్యం ఉండేలా చూసుకోవాలన్నారు. ఇందులో భాగంగా ప్రతిభ ఉన్న వారిని గుర్తించి, వారికి మెరుగైన శిక్షణ, సౌకర్యాలు అందించేందుకు జాతీయస్థాయిలో టాలెంట్ ఐడెంటిఫికేషన్ ప్రోగ్రామ్‌ను ప్రకటించారు. క్రీడా ప్రపంచంలో భారత్ తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటోంది. ప్రపంచవేదికలపై మన జాతీయ గీతాన్ని తరచూ వింటుంటాం. మన మువ్వన్నెల జెండా ఎగరవేయడం చూస్తున్నాం. టాప్స్ గొప్ప విజయాన్ని సాధించింది. ఖేలో ఇండియా గేమ్స్, యూనివర్సిటీ గేమ్స్, బీచ్ గేమ్స్, వింటర్ గేమ్స్, స్పోర్ట్స్ మెడిసిన్, స్పోర్ట్స్ న్యూట్రిషన్ ఇలా ఏ రంగంలోనైనా భారతదేశం వేగంగా దూసుకుపోతోంది. 2036లో ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు మనం కూడా పోటీపడుతున్నాం. 2030లో కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇస్తున్నాం. ఒలింపిక్స్‌లో దాదాపు 40 క్రీడాంశాలు, సుమారు 350 ఈవెంట్లు ఉంటాయి. అయితే చాలా క్రీడల్లో కనీస అర్హత సాధించలేక పోతున్నందున.. మూడింట రెండొంతుల గేమ్స్‌లో మనం పోటీ కూడా పడలేక పోతున్నాం. 2036లో మనం కనీసం మూడు వంతుల ఈవెంట్లలో పాల్గొనాలని నిర్ణయించుకున్నాం.



## నేడు తెరుచుకోనున్న శబరిమల ఆలయం

**తిరువనంతపురం, ఆగస్ట్ 15 :** కేరళలోని ప్రసిద్ధ శబరిమల అయ్యప్ప ఆలయం ఆదివారం తెరుచుకోనుంది. చింగం మాస పూజల నిమిత్తం ఆలయాన్ని తెరుస్తున్నామని, భక్తులకు సౌకర్యాలు కలిపించేందుకు ట్రావెన్ కోర్ దేవస్థానం బోర్డ్ (టీడీబీ), కేఎస్‌ఆర్‌టీసీ తగిన ఏర్పాట్లు చేస్తున్నాయని అధికారులు తెలిపారు. ఆలయ పూజారి కందరారు బ్రహ్మదత్తన్ సమక్షంలో ఆలయ ప్రధాన పూజారి ప్రసాద్ ఇ.డి.ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఆలయాన్ని తెరుస్తారని టీడీబీ ఓ ప్రకటనలో తెలిపింది. మలయాళ నూతన సంవత్సర ఆరంభాన్ని పురస్కరించుకొని ఈనెల 17న ఉదయం 5 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పిస్తారు. చింగం మాస పూజలు ముగిశాక ఆగస్టు 21 రాత్రి 10 గంటలకు ఆలయాన్ని మూసివేసి, తిరిగి ఓనం పండుగ పూజల కోసం ఈనెల 24న తెరుస్తారు.

## ఉగ్ర సంస్థలతో లింకులు..

**బెంగళూరులో వ్యక్తి అరెస్ట్**

**బెంగళూరు, ఆగస్ట్ 15 :** అఫ్ఘానిస్థాన్ కేంద్రంగా నడుస్తోన్న ఉగ్రముఠాతో సంబంధం ఉన్న అసఫూల్ మాలిక్ అనే యువకుడిని బెంగళూరు పోలీసులు అరెస్ట్ చేశారు. తెహ్రీక్-ఎ-తాలిబన్ పాకిస్థాన్ సభ్యుడితో కలిసి, ఆ సంస్థలో చేరడానికి ప్రయత్నిస్తున్నట్లు గుర్తించారు. అనుమానాస్పద ఆన్‌లైన్ కార్యకలాపాలపై సమాచారం అందడంతో అతడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన అసఫూల్ మాలిక్ అనే వ్యక్తి ఏడాదిగా బెంగళూరు లోని జిగాని ప్రాంతంలో ప్రముఖ టెక్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. కొంతకాలంగా అతడు అనుమానాస్పద కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు బొమ్మసంద్ర ఇండస్ట్రియల్ ఏరియాలో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు గుర్తించారు. శుక్రవారం అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా ఉగ్రవాద సంస్థలతో లింకులు బయపడ్డాయి. అఫ్గాన్‌కు చెందిన టీటీపి ఉగ్రసంస్థ హ్యాండ్లర్‌తో అతడు తరచూ సంప్రదింపులు జరుపుతున్నాడు. భారత్, పాకిస్థాన్‌లో దాడులకు వారు ప్రణాళికలు రచించినట్లు తెలుస్తోంది. ఇందుకోసం అఫ్గాన్‌కు వెళ్లి..ఉగ్ర సంస్థలో చేరడానికి అతడు సిద్ధమవుతున్నట్లు పోలీసులు గుర్తించారు. పాకిస్థాన్‌లోని ఉగ్ర సంస్థలతో సంబంధాలు ఉన్న ఇద్దరు ఉత్తర్‌ప్రదేశ్ వ్యక్తులను కూడా అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.



# ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**Q6NEWS– జనం వార్త దినపత్రిక కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ**

**స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్న యాజమాన్యం, సిబ్బంది, మిత్రులు**

**హైదరాబాద్, ఆగస్టు 15:** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని Q6NEWS ఛానల్ -- జనం వార్త దినపత్రిక కార్యాలయం నందు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను యాజమాన్యం, కార్యాలయ సిబ్బంది, కుటుంబ సభ్యులు, మిత్రులు ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా Q6NEWSచైర్మన్ నాగరాజు పటేల్ జాతీయ జెండాను ఆవిష్కరించి జెండాకు వందనం చేశారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపిస్తూ దేశభక్తి భావాన్ని చాటుకున్నారు. కార్యాలయ ఆవరణలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి.

Q6NEWS స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు చిరస్మరణీయం

ఈ సందర్భంగా నాగరాజు పటేల్ మాట్లాడుతూ... భారతదేశానికి స్వాతంత్ర్యం ఒక్కరోజులో రాలేదని, ఎంతోమంది స్వాతంత్ర్య సమ-రయోధులు తమ జీవితాలను, సుఖాలను త్యాగం చేసి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడారని గుర్తు చేశారు. మహాత్మా గాంధీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు, కొమరం భీమ్ వంటి ఎందరో మహనీయుల పోరాట స్ఫూర్తి, త్యాగాల ఫలితంగానే మనం ఈరోజు స్వేచ్ఛా వాయువులను పీలుస్తున్నామని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహనీయులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, వారి ఆశయాలకు అనుగుణంగా దేశ అభివృద్ధిలో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, ప్రజలకు వాస్తవాలను తెలియజేయడం మీడియా సంస్థల బాధ్యత అని పేర్కొంటూ, ఞ6చీజుఔో మరియు జనం వార్త దినపత్రిక ప్రజల గొంతుకగా మరింత బాధ్యతాయుతంగా పనిచేస్తాయని తెలిపారు. ఈ స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో ధనలక్ష్మి నిలయంలోని కుటుంబ సభ్యులు కూడా పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాకు వందనం చేసి దేశభక్తి గీతాలను ఆలపించారు. అనంతరం ఒకరికొకరు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో Q6NEWS-- జనం వార్త దినపత్రిక కార్యాలయ సిబ్బందితో పాటు సాయికుమార్ పటేల్, శ్రీనివాస్ పటేల్, నవీన్ పటేల్, సాయికుమార్, శేఖర్, సందీప్, అనిల్, సత్తయ్య, ముత్యాల శంకర్, గణేష్, బాలు, వెంకటరెడ్డి, మంగళ్, కృష్ణారెడ్డి, మల్లారెడ్డి తదితర మిత్రులు పాల్గొన్నారు. జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం స్వీట్లు పంచుకుని స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.



















# ఘనంగా నాగారంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## జెండాను ఆవిష్కరించిన కొమిరెల్లి సుధాకర్ రెడ్డి

**నాగారం,ఆగస్టు 15(జనంవార్త) :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని నాగారం డివిజన్ పరిధిలోని భాగ్య నగర్, విష్ణుపూరి కాలనీ, బాపూజీ నగర్,శాంతి నగర్,విజయపూరి పలు కాలనీలలో 80వ స్వతంత్ర దిన వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 9వ వార్డు మాజీ కౌన్సిలర్ కోమిరెల్లి అనిత సుధాకర్ రెడ్డి ముఖ్య అతిధిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎందరో మహనీయుల ప్రాణ త్యాగ పాలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్రమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమం లో వివిధ కాలనీల అధ్యక్షులు కిషన్ నాయక్,యాకయ్య, సత్యంరాజు,నర్సింహా, నాయకులు కొత్త గోపాల్ రెడ్డి,పైళ్ల మల్లారెడ్డి,బైరెడ్డి మల్లారెడ్డి,చెంది శ్రీనివాస్, పంజలా నర్సింహా గౌడ్, కృష్ణమాచార్యులు,శ్రీను గౌడ్,జ్ఞానేశ్వరి,శ్రీనివాస్ రెడ్డి,రమేష్,ఉమేష్, రాజేష్,రాజేష్,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# 8 మంది వార్డు సభ్యులకు 8 రకాల బాధ్యతలు

## సర్పంచ్ కృష్ణవేణి హరి నాయక్ కీలక నిర్ణయం

**ఫరూఖ్‌నగర్, ఆగస్టు 15 (జనం వార్త):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూఖ్‌నగర్ మండలం గిరాయిగుట్ట తండా గ్రామ పంచాయతీలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ కృష్ణవేణి హరి నాయక్ జాతీయ జెండాను ఆవిష్కరించి గ్రామ ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశభక్తి, గ్రామ అభివృద్ధిపై చర్చించారు. అనంతరం గ్రామ అభివృద్ధిని మరింత వేగవంతం చేయాలనే ఉద్దేశంతో నూతనంగా ఎన్నికైన ఎనిమిది మంది వార్డు సభ్యులకు ఒక్కొక్కరికి ప్రత్యేక బాధ్యతలను సర్పంచ్ కృష్ణవేణి హరి నాయక్ అప్పగించారు. 1వ వార్డు సభ్యులకు సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ, మోరీలు, ఇంకుడు గుంతల నిర్మాణ బాధ్యతలు, 2వ వార్డు సభ్యులకు విద్యా సంస్థల అభివృద్ధి, 3వ వార్డు సభ్యులకు ఇంటి పన్నులు, నూతన భవన నిర్మాణాలకు సంబంధించిన అంశాలు, 4వ వార్డు సభ్యులకు ఎల్ఈడీ లైట్లు, క్రీడా కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా 5వ వార్డు సభ్యులకు పంచాయతీ సిబ్బంది పర్యవేక్షణతో పాటు స్వచ్ఛ గిరాయిగుట్ట కార్యక్రమాలు, 6వ వార్డు సభ్యులకు హరితహారం, నర్సరీ అభివృద్ధి, 7వ వార్డు సభ్యులకు మిషన్ భగీరథ, బోర్ మోటర్ల నిర్వహణ, 8వ వార్డు సభ్యులకు ఆసరా పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన బాధ్యతలను కేటాయించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజు, పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ, మాజీ సర్పంచ్ రాములు నాయక్, వార్డు సభ్యులు రాణి పాండు, రాజు, మౌనిక రమేష్, పవన్ కుమార్, సరిత నరేష్ బాబు, సువర్ణ మురళి, సరిత కిషన్, మాజీ వార్డు సభ్యులు బాలు, అంగన్‌వాడీ టీచర్లు, సీనియర్ నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



# ముండోని రాయి తండాలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు స్ఫూర్తిదాయకం: సర్పంచ్ తేజ్యా నాయక్

**ఫరూక్‌నగర్ ఆగస్టు 15(జనం వార్త ):** మండల పరిధిలోని ముండోని రాయి తండా గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తేజ్యా నాయక్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సర్పంచ్ తేజ్యా నాయక్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన సమరయోధుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. వారి త్యాగాల ఫలితంగానే దేశ ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు. యువత దేశ అభివృద్ధిలో చురుకుగా భాగస్వాములు కావాలని, దేశ ప్రగతికి తమ వంతు కృషి చేయాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బాపూజీ నగర్ కాలనీ అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం

## ఘనంగా అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ

**నాగారం,ఆగస్టు 15(జనంవార్త) :** నాగారం డివిజన్ పరిధిలోని బాపూజీ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యాలయాన్ని మాజీ వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, స్థానిక మాజీ కౌన్సిలర్ కొమ్మిరెల్లి అనిత సుధాకర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం కమిటీ హాల్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత భారత రత్నా బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహని బిజెపి సీనియర్ నాయకు





లు బైరెడ్డి మల్లారెడ్డి ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు మాట్లాడుతూ మాజీ కౌన్సిలర్ కొమ్మిరెల్లి అనిత సుధాకర్ రెడ్డి కాలనీ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించారని కాలనీ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అతిధులకు శాలువాను కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాలనీఅధ్యక్షులు యాకయ్య,అబ్బోజు రాంసుధాకర్,చంద్రయ్య, శ్రీనివాస్ రెడ్డి,కొత్త గోపాల్ రెడ్డి,పైళ్ల మల్లారెడ్డి,గంట రమేష్,గంట శ్రీకాంత్, నారాయణ,విజయ్, హాసన్,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# డిఎస్ఆర్ కాలనీలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం

## జెండాను ఎగురవేసిన జలమండలి అధికారి సాయికిరణ్ గౌడ్

**నాగారం,ఆగస్టు15(జనం వార్త) :** నాగారం డివిజన్ పరిధిలోని డి.ఎస్.ఆర్ కాలనీలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డివిజన్ జలమండలి మేనేజర్ సాయి కిరణ్ గౌడ్ హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరవీరులు, మహనీయులను స్మరిం





చుకుంటూ వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలం మన జీవనానికి ఆధారం అన్నారు. ప్రతి ఒక్కరు తమ ఇంటి వద్ద ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకుని వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేసుకోవాలని కాలనీ వాసులకు విజ్ఞప్తి చేశారు. భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా చేయాలంటే,ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

# కేపీహెచ్‌బీలో ఘనంగా విద్యార్థుల తిరంగా ర్యాలీ

## ఉత్సాహంగా పాల్గొన్న శిశుమందిర్ విద్యార్థులు

**కూకట్ పల్లి, ఆగస్టు 15, (జనం వార్త) :** 80 వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కేపీహెచ్‌బీ కాలనీలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు కాలనీలో ఘనంగా 'తిరంగా ర్యాలీ' నిర్వహించారు. హౌచిన్నారులు చిట్టి చేతులతోహజాతీయ జెండాలు పట్టుకుని భారత్ మాతాకీ జై, వందేమాతరం నినాదాలతో కాలనీలో తిరగడంతో అందరి మనస్సులను ఆకట్టుకున్నారు. విద్యార్థులు కాలనీలో భారత్ మాతాకీ జై, వందేమాతరం నినాదాలతో తిరగడంతో పరిసర ప్రాంతాలు మారుమ్రోగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగాహకూకట్‌పల్లి నియోజకవర్గం బిజెపి ఇన్ ఛార్జ్, నిజామాబాద్ జిల్లాహబిజెపి ఇన్‌ఛార్జ్ మాధవరం కాంతారావు, బీజేపీ నాయకులు విజిత్, రాష్ట్ర డాక్టర్స్ సెల్ కన్వీనర్ డా. రామకృష్ణ, నర్వ పవన్, మేడ్చల్ అర్బన్ ఐటీ సెల్ కన్వీనర్ పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. హౌ ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూహభావితరాల్లో దేశభక్తిని, జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమా



లు ఎంతో దోహదపడతాయని కొనియాడారు. విద్యార్థులకు చిన్నతనం నుంచే దేశ సంస్కృతి, సంప్రదాయాలు, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**కూకట్‌పల్లి, ఆగష్టు 15, (జనం వార్త) :** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆల్విన్ కాలనీ లోని కేర్ అండ్ క్యూర్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఆసుపత్రి నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జాహెద్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆల్విన్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జాహెద్ మాట్లాడుతూ భావితరాల్లో దేశభక్తిని, జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని కొనియాడారు. విద్యార్థులకు చిన్నతనం నుంచే దేశ సంస్కృతి, సంప్రదాయాలు, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్థో మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్. జి.ఎన్.షసురేష్ బాబు,డాక్టర్ సాయి



భరద్వాజ్ డాక్టర్ బాబాజాన్,డాక్టర్ సైదా,డాక్టర్, అనిల్, డాక్టర్ తరుణ్,సుద్దాల శ్రీకాంత్, ల్యాబ్ ఇంచార్జి .మహేష్,సౌందర్య కె.సుకీర్తి,రిసెప్షన్ విజయలక్ష్మి వరుణ్ ఆకాష్, ఆస్పత్రి సిబ్బంది, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# చందానగర్‌లో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ 'ఆర్టిస్ట్రీ' ఆభరణాల ప్రదర్శన

## ఆగస్టు 24 వరకు ప్రత్యేక ప్రదర్శన.. ప్రారంభించిన సినీ నటి శోభా శెట్టి

**శేరిలింగంపల్లి, ఆగస్టు 15(జనం వార్త):** చందానగర్‌లోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌లో 'ఆర్టిస్ట్రీ' పేరుతో ప్రత్యేక బ్రాండెడ్ ఆభరణాల ప్రదర్శన ప్రారంభమైంది. ఆగస్టు 14 నుంచి 24వ తేదీ వరకు ఈ ప్రదర్శన కొనసాగనుంది. ఈ కార్యక్రమాన్ని సీరియల్ నటి శోభా శెట్టి, వినియోగదారులు, శ్రేయోభిలాషులు, మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రతినిధుల సమక్షంలో ప్రారంభించారు. ప్రదర్శనలో అత్యాధునిక కళానైపుణ్యంతో రూపొందించిన బంగారు, వజ్ర, జాతిరత్న ఆభరణాలను అందుబాటులో ఉంచారు. ప్రతి ఆభరణంలో కళాత్మకత, నైపుణ్యాన్ని ప్రతిబింబించేలా ప్రత్యేక డిజైన్లను రూపొందించారు. 'ప్రతి ఆభరణంలో కళ' అనే ప్రత్యేకతతో ఈ ప్రదర్శనను నిర్వహిస్తున్నారు. 'ఆర్టిస్ట్రీ'లో భాగంగా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ బ్రాండెడ్ సమాహారాలైన 'మైన్' వజ్రాభరణాలు, వివాహాలు--వేడుకల కోసం 'ఎరా' వజ్రాభరణాలు, 'ప్రిఫెక్ట్' జాతిరత్నాభరణాలు, 'ఎలిత్' హస్తకళా నైపుణ్యంతో రూపొందించిన ఆభరణాలు, 'జోయల్' ఆధునిక డిజైన్లు, 'డైమన్' భారతీయ సంప్రదాయ శైలిని ప్రతిబింబించే ఆభరణాలు, చిన్నారుల కోసం 'స్టార్లెట్' ఆభరణాలను ప్రదర్శిస్తున్నారు. వినియోగదారులకు పారదర్శక ధరల పట్టిక, తయారీ ధర--రాళ్ల బరువు--నికర బరువు వివరాలు, జీవితకాల ఉచిత నిర్వహణ వంటి పలు సదుపాయాలను



సంస్థ అందిస్తోంది. బంగారు ఆభరణాల విక్రయం, మార్పిడిపై విలువ, వజ్రాభరణాల మార్పిడిపై ప్రత్యేక హామీలు, హాల్‌మార్క్ ధృవీకరణతో కూడిన స్వచ్ఛమైన బంగారం, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యత పరీక్షించిన వజ్రాలను అందిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. అదనంగా బైబ్యాక్ హామీ, క్యారెట్ ఎనలైజర్ ద్వారా నాణ్యత తనిఖీ, జీవితకాల నిర్వహణ, బాధ్యతాయుతమైన వనరుల నుంచి బంగారం సేకరణ వంటి పలు హామీలను సంస్థ అందిస్తోంది. చందానగర్ షోరూమ్‌లో ఆగస్టు 24 వరకు కొనసాగే 'ఆర్టిస్ట్రీ' ప్రదర్శనను వినియోగదారులు సందర్శించవచ్చు.



# నాగర్‌కర్నూల్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**నాగర్‌కర్నూల్ ఆగస్టు15 (జనం వార్త):** నాగర్‌కర్నూల్ జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిసి లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.05 కోట్ల స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని, నాగర్‌కర్నూల్ జిల్లాలోని 20 మండలాల్లో 2,77,457 కార్డులు అందిస్తున్నామని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులు రేషన్ సరుకులతో పాటు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్య, వైద్య సేవలు పొందేందుకు ఉపయోగపడతాయని చిన్నారెడ్డి పేర్కొన్నారు. పేదలకు ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల వరకు ఆర్థిక సహాయం, సన్న రకాల ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమానికి ముందు 11 మందికి కారుణ్య నియామక పత్రాలను ఎంపీ, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ అందజేశారు. అనంతరం 20 మండలాలకు చెందిన లబ్ధిదారులకు నూతన డిజిటల్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్లు, అదనపు కలెక్టర్లు, అధికారులు, డీలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# సామాజిక న్యాయం కోసం ఐక్యంగా పోరాడాలి

**మహబూబ్‌నగర్ ఆగస్టు 15 ( జనం వార్త):** జిల్లా ఎస్పీ కార్యాలయ పరేడ్ గ్రౌండ్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రివర్యులు, దేవరకద్ర ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు, విద్యార్థులు, యువకులు, జిల్లా, రాష్ట్ర నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్ గుడిసె బాలయ్య ముదిరాజ్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ సమైక్యత, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలకు సమాన హక్కులు, సమానత్వం, సామాజిక న్యాయం సాధించేందుకు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. "ఎవరి కులమెంతో వారికి అంత వాటా.. కులమెంతో రిజర్వేషన్ అంత" అనే నినాదంతో సామాజిక న్యాయం సాధించేందుకు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బహుజన రాజ్య సాధన దిశగా బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు, యువత, నాయకులు ఐకమత్యంతో ఉద్యమించాలని కోరారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ గుడిసె బాలయ్య ముదిరాజ్ శుభాకాంక్షలు తెలిపారు.



# ప్రతిభావంతులైన విద్యార్థులకు ఘన సత్కారం

**నాగర్‌కర్నూల్ ఆగస్టు 15(జనం వార్త ):** నాగర్‌కర్నూల్ జిల్లా క్లాస్‌మెంట్ క్లబ్ ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షల్లో వివిధ మండలాల్లో మండల స్థాయిలో ప్రథమ స్థానాలు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్, వైస్ చైర్మన్ బాదం రమేష్, టౌన్ ప్రెసిడెంట్ జక్కా రాజు, కౌన్సిలర్లు మొహమ్మద్ నిజ్జమొదిన్, శంకర్, నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, క్లాస్‌మెంట్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



# దేశభక్తి స్ఫూర్తితో శేరిలింగంపల్లిలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

**శేరిలింగంపల్లి, ఆగస్టు 15(జనం వార్త):** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జెండావందన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. లింగంపల్లి సగర సంఘం, శేరిలింగంపల్లి లారీ అసోసియేషన్, గుల్మోహర్ పార్క్, నేతాజీ నగర్ కమ్యూనిటీ హాల్, గచ్చిబౌలి అంజయ్యనగర్ సగర సంఘం ఆవరణల్లో జరిగిన వేడుకలకు తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉప్పరి శేఖర్ సగర మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగా లభించిన స్వేచ్ఛను దేశ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి స్వాతంత్ర్య ఫలాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కోరారు. దేశ సమైక్యత, సమగ్రతను కాపాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతాయుత పౌరులుగా వ్యవహరించాలని ఆయన సూచించారు. దేశ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా సంఘాల నాయకులు, సభ్యులు, కాలనీ ప్రముఖులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ జెండాకు వందనం సమర్పించారు.

## ఇంధన ఎగుమతులపై విండ్‌ఫాల్ గెయిన్స్ ట్యాక్స్ తగ్గింపు



పెట్రోల్, డీజిల్, ఏటీఎఫ్ ఎగుమతులపై కేంద్రం విండ్‌ఫాల్ గెయిన్స్ ట్యాక్స్‌ను తగ్గించింది. డీజిల్ ఎగుమతులపై ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకం (రాూజుణ) రేటు గతంలో లీటరుకు రూ.25.5 ఉండగా.. ప్రస్తుతం దాన్ని రూ. 24కు తగ్గించింది. ఏటీఎఫ్ ఎగుమతులపై ఎక్సైజ్ సుంకం రేటును లీటరుకు రూ.22నుంచి రూ.19.5కు తగ్గించింది. పెట్రోల్ ఎగుమతులపై లీటరుకు రూ.3.5 ఉన్న సుంకాన్ని సున్నాకు పరిమితం చేసింది. ఆగస్టు 15 నుంచి రెండు వారాల పాటు ఈ ధరలు అమల్లో ఉండనున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో దేశీయ ఇంధన లభ్యతను పెంచడానికి ప్రభుత్వం ఇటీవల విండ్‌ఫాల్ పన్ను విధించింది. ఇందులో భాగంగా మార్చి 27న డీజిల్, ఏటీఎఫ్‌లపై.. మే 16 నుంచి పెట్రోల్ ఎగుమతులపై ఎగుమతి సుంకాన్ని పెంచింది. నాటి నుంచి ఈ ధరలను ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షిస్తోంది.






## స్వల్పంగా తగ్గిన టోకు ధరలు

దేశీయంగా టోకు ధరలు అధికంగానే ఉన్నా, జూన్‌తో పోలిస్తే గత నెలలో స్వల్పంగా తగ్గాయి. జులైలో టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 9.78 శాతంగా నమోదైంది. జూన్‌లో ఇది 9.87 శాతంగా ఉంది. కాగా.. గత 9 నెలల్లో టోకు ద్రవ్యోల్బణం నెల ప్రాతిపదికన తగ్గడం ఇప్పుడే. ఇంధనం, ఆహార పదార్థాల ధరలు తగ్గుముఖం పట్టడం ఇందుకు కారణమని వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇంధనం, విద్యుత్ రంగాల టోకు ద్రవ్యోల్బణం జూన్‌లోని 27.41% నుంచి జులైలో 20.05 శాతానికి తగ్గింది. ఆహార వస్తువుల ధరల్లో పెరుగుదల 5.49% నుంచి 5.44 శాతానికి తగ్గింది. తయారీ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం 7.48% నుంచి 8.29 శాతానికి పెరిగింది. రాబోయే అయిదేళ్లలో డబ్ల్యూపీఐ స్థానంలో ప్రభుత్వం తేవాలనుకుంటున్న అవుట్‌పుట్ ప్రొడ్యూసర్ ప్రైస్ ఇండెక్స్ (పీపీఐ) జూన్‌తో పోలిస్తే మార్పు లేకుండా 9.6% వద్దే ఉంది. ఈ సూచీ ప్రకారం తయారీ, గనుల రంగాల్లో తక్కువ ద్రవ్యోల్బణం ఉండగా.. వ్యవసాయం, విద్యుత్‌లో అధిక ద్రవ్యోల్బణం నమోదైంది. రానున్న నెలల్లో టోకు ధరలు ఇంకా తగ్గొచ్చని బార్‌క్లేస్ తన పరిశోధనా నివేదికలో తెలిపింది.

# దేవదత్ పడిక్కల్ అజేయ శతకం

### రాహుల్, పడిక్కల్ ఆధిపత్యం.. తొలి రోజు 2 వికెట్లకు 288 పరుగులు

శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్‌ను టీమిండియా ఘనంగా మొదలెట్టింది. గాలే వేదికగా శనివారం ప్రారంభమైన మ్యాచ్‌లో అద్వితీయమైన బ్యాటింగ్ ప్రదర్శనతో ఆధిపత్యం చెలాయించింది. దేవదత్ పడిక్కల్(178 బంతుల్లో 12 ఫోర్లు, సిక్స్‌తో 131 బ్యాటింగ్) అజేయ శతకంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 73 ఓవర్లలో 2 వికెట్లకు 288 పరుగుల భారీ స్కోర్ చేసింది. దేవదత్ పడిక్కల్‌తో పాటు రిషభ్ పంత్(36 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 27 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. కేఎల్ రాహుల్( 162 బంతుల్లో 9 ఫోర్లు, సిక్స్‌తో 77 రిటైర్డ్ హర్ట్) హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. శ్రీలంక బౌలర్లలో ప్రబాత్ జయసూర్య ఒక వికెట్ తీసాడు. వర్షం అంతరాయం కారణంగా తొలి రోజు 77 ఓవర్ల ఆటనే సాధ్యమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు శుభారంభం దక్కలేదు. సాధికారికంగా బ్యాటింగ్ చేసిన ఓపెనర్ యశస్వి జైస్వాల్(32) దురదృష్టకర రీతిలో రనౌటయ్యాడు. శ్రీలంక అరంగేట్ర స్పిన్నర్ కేశర నువంత తప్పిదంతో జైస్వాల్ బలయ్యాడు. కేఎల్ రాహుల్ ఆడిన బంతిని అడ్డుకోవడానికి కేశర డైవ్ చేయగా.. సింగిల్‌కు ప్రయత్నించిన జైస్వాల్ అతన్ని తాకి కిందపడిపోయాడు. అప్పటికే కేఎల్ రాహుల్ నాన్‌స్ట్రైక్ ఎండ్‌కు రాగా.. జైస్వాల్ కూడా యూటర్న్ తీసుకున్నాడు. దాంతో రనౌట్‌గా వెనుదిరిగాల్సి వచ్చింది. క్రీజులోకి వచ్చిన దేవదత్ పడిక్కల్‌తో కేఎల్ రాహుల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ జోడీ ఆచితూచి ఆడటంతో టీమిండియా 27 ఓవర్లలో 101/1 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. ఇదే సమయంలో వర్షం రావడంతో గంటన్నర తర్వాత రెండో సెషన్ మొదలైంది. రాహుల్, పడిక్కల్ తమ జోరును కొనసాగించారు. తమకే సాధ్యమైన షాట్లతో శ్రీలంక బౌలర్లపై ఆధిపత్యం చెలాయించారు. రాహుల్ కాస్త నిదానంగా ఆడినా.. పడిక్కల్ వీలు చిక్కిన బంతిని బౌండరీకి తరలించాడు. ఈ క్రమంలో అతను 81 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరోవైపు కేఎల్ రాహుల్ 127 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. దాంతో టీమిండియా 197/1 స్కోర్‌తో టీ బ్రేక్ వెళ్లింది. ఆఖరి సెషన్‌లో కేఎల్ రాహుల్ బ్యాటింగ్ కొనసాగించలేకపోయాడు. చేతి, కాలి కండరాలు పట్టేయడంతో రిటైర్డ్ హర్ట్‌గా మైదానం వీడాడు. క్రీజులోకి కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రాగా.. కేశర నువంత బౌలింగ్‌లో క్విక్ సింగిల్ తీసి పడిక్కల్ 134 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. పడిక్కల్‌కు ఇదే తొలి టెస్ట్ సెంచరీ కావడం గమనార్హం. తన మూడో టెస్ట్‌లోనూ ఈ ఫీట్ సాధించాడు. మరోవైపు శుభ్‌మన్ గిల్(16) నిరాశపర్చాడు. ప్రబాత్ జయసూర్య బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. క్రీజులోకి పంత్ రాగా.. వర్షం అంతరాయం కలిగించింది. కాసేపటి తర్వాత ఆట తిరిగి ప్రారంభం కాగా.. పంత్(27 బ్యాటింగ్), పడిక్కల్ దూకుడుగా ఆడారు. అజేయంగా 52 పరుగులు జోడించి తొలి రోజు ఆటను ముగించారు. కాగా.. దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారత్ తన చారిత్రక 600వ టెస్ట్ మ్యాచ్ ఆడుతుండగా ఈ విచిత్రమైన రనౌట్ నమోదు కావడం విశేషం. రెండు మ్యాచ్‌ల ఈ టెస్టు సిరీస్‌లోని తొలి మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మొదట బ్యాటింగ్ ఎంచుకున్నాడు. 2027 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో నిలవడానికి ఇరు జట్లకు ఈ సిరీస్ పాయింట్లు ఎంతో కీలకం. ప్రస్తుతం డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్ ఐదో స్థానంలో ఉండగా, శ్రీలంక ఆరో స్థానంలో కొనసాగుతోంది.







## బ్యాకప్ లేకుండానే.. కొత్త ఫోన్‌లోకి వాట్సప్ డేటా

కొత్తగా స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేసినప్పుడు.. చాలా మంది తమ పాత ఫోన్‌లోని వాట్సప్ చాట్‌లు, ఫొటోలను బ్యాకప్ చేయడానికి గూగుల్ డ్రైవ్ లేదా ఐక్లౌడ్ వంటి థర్డ్ పార్టీ బ్యాకప్‌లపై ఆధారపడుతుంటారు. వాస్తవానికి ఈ డేటాను సులువుగా ట్రాన్స్‌ఫర్ చేయడానికి వాట్సప్ ఎప్పటి నుంచో చాట్ ట్రాన్స్‌ఫర్ ఫీచర్‌ను అందిస్తోంది. దీని గురించి అవగాహన లేక చాట్ హిస్టరీని బ్యాకప్ చేసి.. మళ్లీ కొత్తగా వాట్సప్‌ను ఇన్‌స్టాల్ చేసి రీస్టోర్ చేస్తున్నారు. దీనివల్ల మొబైల్ డేటా, సమయం రెండూ వృథా అవుతుంటాయి. వాట్సప్ అందించే చాట్ ట్రాన్స్‌ఫర్ వాడితే క్షణాల్లో మీ చాట్ కొత్త ఫోన్‌లో ప్రత్యక్షమవుతుంది. దీన్నెలా ఉపయోగించాలంటే? తొలుత పాత ఫోన్‌లో వాట్సప్ ఓపెన్ చేసి సెట్టింగ్‌లోకి వెళ్లాలి. అందులో చాట్స్ ఆప్షన్ క్లిక్ చేయాలి. ట్రాన్స్‌ఫర్ చాట్స్ ఆప్షన్ ఎంపిక చేసుకొని న్ఖుతీ బటన్ నొక్కితే ని= కోడ్ స్కానర్ ఓపెన్ అవుతుంది. ఆపై కొత్త ఫోన్లో మొదట వాట్సప్ ఇన్‌స్టాల్ చేసి ఓపెన్ చేయాలి. టర్మ్స్ అండ్ కండిషన్స్ యాక్సెప్ట్ చేయాలి. పాత ఫోన్‌లోని వాట్సప్ నంబరుతో కొత్త ఫోన్‌లో వాట్సప్ లాగిన్ అవ్వాలి. ఓటీపీతో వెరిఫై కావాల్సి ఉంటుంది. అప్పుడు స్క్రీన్‌పై డేటా ట్రాన్స్‌ఫర్ ఆప్షన్ కనిపిస్తుంది. దాన్ని క్లిక్ చేయగానే కొత్త ఫోన్ స్క్రీన్‌పై కనిపించే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలి. రెండు ఫోన్లను కనెక్ట్ చేయాల్సిన అనుమతులను యాక్సెప్ట్ చేయాలి. ప్రక్రియ పూర్తయ్యాక మీ పాత ఫోన్‌లోని చాట్‌లు, ఫొటోలు, వీడియోలు అన్నీ యథావిధిగా కొత్త ఫోన్‌లోకి వచ్చేస్తాయి. నూరు శాతం డేటా ట్రాన్స్‌ఫర్ పూర్తయ్యేవరకు రెండు ఫోన్‌లలో వాట్సప్‌ను మూసివేయకుండా పక్కపక్కనే ఉంచాలి. స్మార్ట్‌ఫోన్లలో వైఫై, లొకేషన్ ఆన్‌లోనే ఉంచాలి. ఈ పద్ధతి ఆండ్రాయిడ్ టు ఆండ్రాయిడ్, ఐఫోన్ టు ఐఫోన్‌కు మాత్రమే పనిచేస్తుంది. ప్రయోజనాలు ఇవీ: మీ వాట్సప్ డేటాను థర్డ్ పార్టీ క్లౌడ్‌లో అప్‌లోడ్ చేసి, మళ్లీ డౌన్‌లోడ్ చేయాల్సిన అవసరం ఉండదు. కాబట్టి ఇంటర్నెట్ ఆదా అవుతుంది. డేటా నేరుగా ఫోన్ టు ఫోన్‌కి బదిలీ కావడం వల్ల సమయం ఆదా అవుతుంది. ఇతర యాప్‌లు లేదా క్లౌడ్ సర్వీస్‌ల ప్రమేయం ఉండదు కాబట్టి మీ డేటా పూర్తి సురక్షితంగా ఉంటుంది.



## రెండో ఇన్నింగ్స్‌లోనూ ఆస్ట్రేలియాకు కష్టాలే

సొంత మైదానంలో బంగ్లాదేశ్‌ను కట్టడి చేద్దామని భావించిన ఆస్ట్రేలియా చివరికి కష్టాల్లో పడింది. మొదటి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకే కుప్పకూలిన ఆ జట్టు.. బౌలింగ్‌లోనూ విఫలమై నిరాశపరిచింది. తన్జిద్ హసన్ (101) సెంచరీ, నజ్ముల్ షాంటో (84), మెహిదీ హసన్ మిరాజ్ (65) అర్ధశతకాలు సాధించడంతో బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 426 పరుగులు చేసింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ రెండో ఇన్నింగ్స్ స్కోరు 161/4. ఇంకా 67 పరుగులు వెనుకబడే ఉంది. ప్రస్తుతం క్రీజ్‌లో కామెరూన్ గ్రీన్ (43ⅰ), అలెక్స్ కేరీ (19ⅰ) ఉన్నారు.

### బంగ్లా బౌలర్ల దెబ్బకు నిలవలేక..

బంగ్లాదేశ్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఆస్ట్రేలియా బ్యాటర్లు ఇబ్బంది పడ్డారు. 228 పరుగుల భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన ఆస్ట్రేలియా అప్పుడే నాలుగు వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. జేక్ వెదర్లాండ్ (0) డకౌట్ కాగా.. ట్రావిస్ హెడ్ (17), మార్నస్ లబుషేన్ (31), స్టీవ్ స్మిత్ (44) పరుగులు చేశారు. హసన్ మహ్మూద్ 2.. తైజుల్ ఇస్లామ్, మెహిదీ చెరో వికెట్ తీశారు. ఓవర్‌నైట్ 351/6 స్కోరుతో మూడో రోజు ఆటను ప్రారంభించిన బంగ్లా 400 పరుగులు దాటడంలో మెహిదీ హసన్ కీలక పాత్ర పోషించాడు. ఆసీస్ బౌలర్లలో జోష్ హేజిల్ వుడ్ (6/89) కాస్త ప్రభావం చూపించాడు. బంగ్లాపై ఫైఫర్ తీసిన తొలి ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్‌గా ఘనత సాధించాడు. ఆసీస్ తరఫున 300 అంతకంటే ఎక్కువ వికెట్లు తీసిన తొమ్మిదో బౌలర్‌గానూ హేజిల్‌వుడ్ నిలిచాడు. ప్రస్తుతం అతడి ఖాతాలో 301 వికెట్లు ఉన్నాయి.

## హాకీ ప్రపంచకప్‌లో భారత జట్టు శుభారంభం

### తొలి మ్యాచ్‌లో వేల్స్‌పై భారత్ ఘన విజయం
### తొలి క్వార్టర్‌లోనే భారత్‌కు పెనాల్టీ కార్నర్

నెదర్లాండ్స్‌లో జరుగుతున్న హాకీ ప్రపంచకప్‌లో భారత పురుషుల జట్టు శుభారంభం చేసింది. పూల్–డిలో భాగంగా శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో వేల్స్‌పై భారత్ 3–1 తేడాతో విజయం సాధించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ అద్భుత ప్రదర్శనతో జట్టుకు విజయాన్ని అందించాడు. హర్మన్‌ప్రీత్ రెండు గోల్స్ చేయగా సంజయ్ ఒక గోల్ సాధించాడు. మ్యాచ్ చివరి దశలో వేల్స్ ఒక గోల్ చేసినా అప్పటికే భారత్ తిరుగులేని ఆధిక్యంలో ఉండటంతో విజయానికి ఎలాంటి ఇబ్బంది ఎదురుకాలేదు. మ్యాచ్ ప్రారంభం నుంచే భారత ఆటగాళ్లు దూకుడుగా ఆడారు. తొలి క్వార్టర్‌లోనే భారత్‌కు పెనాల్టీ కార్నర్ లభించింది. ఏడో నిమిషంలో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న సంజయ్ అద్భుతమైన డ్రాగ్‌ఫ్లిక్‌తో గోల్ చేశాడు. వేల్స్ గోల్‌కీపర్‌కు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా బంతిని నెట్‌లోకి పంపాడు. దీంతో భారత్ 1–0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత కూడా భారత జట్టు ఒత్తిడి కొనసాగించింది. మరో పెనాల్టీ కార్నర్‌ను భారత్ దక్కించుకోగా, ఈసారి కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ తన సత్తా చాటాడు. అద్భుతమైన షాట్‌తో బంతిని గోల్‌పోస్ట్ ఎడమ వైపునకు పంపాడు. దీంతో తొలి క్వార్టర్‌లోనే భారత్ 2–0 ఆధిక్యంలోకి వెళ్లింది. మొదటి 15 నిమిషాల్లోనే భారత ఆటగాళ్లు ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. రెండో క్వార్టర్‌లో వేల్స్ కొంత మెరుగ్గా రక్షణాత్మకంగా ఆడింది. భారత్‌కు మరో పెనాల్టీ కార్నర్ లభించినప్పటికీ దానిని గోల్‌గా మలచలేకపోయింది. బంతిని అందుకునే సమయంలో చిన్న పొరపాటు జరగడంతో భారత అవకాశాన్ని కోల్పోయింది. మరో పెనాల్టీ కార్నర్‌లో హర్మన్‌ప్రీత్ చేసిన ప్రయత్నం కూడా లక్ష్యాన్ని చేరలేదు. ఈ క్వార్టర్‌లో ఇరు జట్లూ గోల్ చేయలేకపోయాయి. దీంతో తొలి అర్ధభాగం ముగిసే సమయానికి భారత్ 2–0 ఆధిక్యంలో నిలిచింది. మూడో క్వార్టర్‌లో భారత ఆటగాళ్లు మరింత నియంత్రణతో ఆడారు. ఓపెన్ ప్లేలో కూడా అవకాశాలను సృష్టిస్తూ ప్రత్యర్థి డిఫెన్స్‌పై ఒత్తిడి పెంచారు. ఈ క్రమంలో భారత్‌కు మరో పెనాల్టీ కార్నర్ లభించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ మరోసారి తన డ్రాగ్‌ఫ్లిక్‌తో మెరిశాడు. బంతిని నేరుగా గోల్‌పోస్ట్‌లోకి పంపి భారత్ ఆధిక్యాన్ని 3–0కు పెంచాడు. హర్మన్‌ప్రీత్‌కు ఇది మ్యాచ్‌లో రెండో గోల్.మూడో క్వార్టర్‌లో ఇరు జట్ల నుంచి పెద్దగా గోల్ అవకాశాలు కనిపించలేదు. అయితే 3–0 ఆధిక్యంతో ఉన్న భారత్ మ్యాచ్‌పై పూర్తిగా పట్టు సాధించింది. చివరి క్వార్టర్‌లో వేల్స్ కనీసం ఒక గోల్ చేసి లోటును తగ్గించాలని ప్రయత్నించింది. భారత గోల్‌కీపర్ మోహిత్ కీలక సమయంలో అద్భుతమైన సేవ్ చేశాడు. వేల్స్‌కు లభించిన పెనాల్టీ కార్నర్‌ను సమర్థంగా అడ్డుకుని భారత ఆధిక్యాన్ని కాపాడాడు. అయితే మ్యాచ్ ముగిసే సమయంలో వేల్స్‌కు ఓ గోల్ దక్కింది. భారత గోల్‌పోస్ట్ ముందు తీవ్ర గందరగోళం నెలకొన్న సమయంలో సామ్ వెల్ష్ బంతిని గోల్‌లైన్ దాటించాడు. వీడియో అంపైర్ పరిశీలన తర్వాత గోల్‌ను చెల్లుబాటు అయ్యేదిగా ప్రకటించారు. దీంతో వేల్స్ 1–3తో లోటును తగ్గించింది. ఆ తర్వాత భారత్ ఎలాంటి అవకాశం ఇవ్వకుండా మ్యాచ్‌ను ముగించింది. మ్యాచ్‌లో భారత్‌కు మొత్తం ఐదు పెనాల్టీ కార్నర్లు లభించగా, వాటిలో మూడు గోల్స్‌గా మారడం జట్టు బలాన్ని చాటింది. మరోవైపు, డిఫెన్స్‌లోనూ భారత్ మెరుగైన ప్రదర్శన చేసింది. ప్రత్యర్థికి అవకాశాలు వచ్చినప్పుడు గోల్‌కీపర్ మోహిత్‌తో పాటు డిఫెండర్లు సమర్థంగా అడ్డుకున్నారు. ప్రపంచకప్‌లో భారత జట్టు ఈసారి పతకంపై గురిపెట్టింది. గతంలో ప్రపంచకప్‌లో భారత్ మూడు పతకాలు సాధించగా 1975లో మాత్రమే స్వర్ణ పతకం గెలిచింది. ఈసారి పతక కరవును ముగించాలనే పట్టుదలతో జట్టు బరిలోకి దిగింది. టోర్నీకి ముందు ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్‌లో జర్మనీ, నెదర్లాండ్స్ వంటి బలమైన జట్లపై భారత్ మంచి విజయాలు సాధించింది. పాకిస్థాన్‌ను రెండుసార్లు ఓడించడంతో పాటు ఇంగ్లాండ్‌పైనా విజయం సాధించింది. ప్రపంచకప్‌లో భారత్ పూల్–డిలో ఇంగ్లాండ్, పాకిస్థాన్, వేల్స్‌తో కలిసి ఉంది. తొలి మ్యాచ్‌లో వేల్స్‌ను ఓడించిన భారత్, తదుపరి మ్యాచ్‌లో ఆగస్టు 17న ఇంగ్లాండ్‌తో తలపడనుంది. ఆ తర్వాత ఆగస్టు 19న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడనుంది. ఈసారి ప్రపంచకప్‌లో సంప్రదాయ క్వార్టర్‌ఫైనల్ విధానం ఉండదు. తొలి దశలో ప్రతి పూల్‌లోని టాప్–2 జట్లు తదుపరి దశకు చేరతాయి. అక్కడి నుంచి సెమీఫైనల్ బెర్తులు ఖరారవుతాయి. దీంతో ప్రతి మ్యాచ్‌లో సాధించే విజయం భారత్‌కు కీలకంగా మారింది.





## రూ.5.4 లక్షల కోట్ల విదేశీ నిధులు

### ఆగస్టు 31 వరకే రాయితీ స్వాప్.. గడువు తగ్గించిన ఆర్‌బీఐ

**ముంబయి:** రూపాయి పతనాన్ని అడ్డుకుని, దేశంలోకి డాలర్ల ప్రవాహాన్ని వేగంగా పెంచేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రవేశపెట్టిన రాయితీ స్వాప్ పథకానికి అమిత ఆదరణ లభించింది. ప్రవాసులు జమ చేసే విదేశీ కరెన్సీ డిపాజిట్లపై వడ్డీ రేట్లకు గరిష్ఠ పరిమితులను సడలించడంతో పాటు, కొన్ని కాలపరిమితులపై అయ్యే పూర్తి హెడ్జింగ్ ఖర్చును తానే భరిస్తానని ప్రకటించిన ఈ పథకం కింద ఆగస్టు 13 వరకు 56.84 బిలియన్ డాలర్ల నిధులు వచ్చాయి. ఫారిన్ కరెన్సీ నాన్–రెసిడెంట్ బ్యాంక్ (ఎఫ్‌సీఎన్‌ఆర్–బి) డిపాజిట్ ఖాతాల్లో మూడేళ్లలోపు డిపాజిట్లపై గ్లోబల్ బెంచ్‌మార్క్ రేటు (సుమారు 3.63%) కంటే 2.5% అదనపు వడ్డీ అందించేందుకు బ్యాంకులకు అనుమతి లభించింది. దీంతో ఎన్‌ఆర్‌ఐలు మూడేళ్లలోపు డిపాజిట్లపై గరిష్ఠంగా 6.13% వరకు రాబడి పొందనున్నారు. మూడేళ్లు పైబడిన డిపాజిట్లపై వడ్డీ పరిమితిని ఆర్‌బీఐ పూర్తిగా తొలగించడంతో విదేశీ డిపాజిట్లను ఆకర్షించేందుకు బ్యాంకులు భారీగా వడ్డీ రేట్లు పెంచాయి. గతంలో సెప్టెంబరు 30 వరకు ఈ పెట్టుబడులను అనుమతించాలని నిర్ణయించినా, పెట్టుబడులు భారీగా తరలి వచ్చినందున ఆగస్టు 31 వరకు చేసే డిపాజిట్లకే ఈ ప్రయోజనాలు వర్తిస్తాయని ఆర్‌బీఐ శుక్రవారం తెలిపింది. ఈ డిపాజిట్లకు సంబంధించిన స్వాప్‌లను 2026 సెప్టెంబరు 11 వరకు ఆర్‌బీఐ వద్ద పొందొచ్చు. ఎక్స్‌టర్నల్ కమర్షియల్ బారోయింగ్స్, ఓవర్సీస్ ఫారిన్ కరెన్సీ బారోయింగ్స్‌కు సంబంధించిన పథకం మాత్రం 2026 డిసెంబరు 31 వరకు కొనసాగుతుందని ఆర్‌బీఐ స్పష్టం చేసింది.



# ఓటిటి బాటపట్టిన చెన్నై లవ్ స్టోరీ

కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరీ ప్రియ ప్రధానపాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'చెన్నై లవ్‌స్టోరీ' ఓటిటి బాట పట్టింది. రవి నంబూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి యూత్‌కు కనెక్ట్ అయింది. ఇప్పడీ ప్రేమకథ ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. సోనీలివ్ వేదికగా ఆగస్టు 21 నుంచి స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతోపాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో అందుబాటులోకి రానున్నట్లు సంస్థ అధికారికంగా తెలిపింది. కథేంటంటే..: నివి (శ్రీ గౌరీ ప్రియ) తను ప్రేమించిన అబ్బాయి అజయ్ (త్రిగుణ్)తో కలిసి పెళ్లికి సిద్ధమవుతుంది. కానీ, తీరా ముహూర్త సమయానికి పెళ్లి పీటలెక్కాల్సిన ఆ కుర్రాడు తాను మరో అమ్మాయిని ప్రేమించానని చెప్పి.. బ్రేకప్ చెప్పి వెళ్లిపోతాడు. ఆమెని ఆ బాధ నుంచి బయట పడేసేందుకు మిత్రులు చెన్నైకి తీసుకెళ్లినా ఏ మార్పూ రాదు. పైగా ప్రేమ విఫలమైన బాధలో దేవదాసులా మందుకు బానిసవుతుంది. అలాంటి సమయంలో ఆమె ఉంటున్న ఇంట్లోకి స్టీవెన్ శంకర్ (కిరణ్ అబ్బవరం) అడుగు పెడతాడు. అతనొక అనాథ. దర్శకుడవ్వాలన్న ఆశతో చెన్నైలోకి అడుగు పెట్టిన అతనికి.. నివి ఫ్రెండ్స్ గ్యాంగే ఆశ్రయమిస్తారు. మొదట్లో స్టీవెన్ చేసే పనులు నివికి చిరాకు తెప్పించినా.. క్రమంగా అతని మాటలు, చేతలు తనలో మార్పు తెస్తాయి. ఈ క్రమంలోనే బ్రేకప్ బాధ నుంచి బయటపడి.. స్టీవెన్‌కి దగ్గరవుతుంది. మళ్లీ ఆమెలో ప్రేమ చిగురిస్తుంది. మరి ఆ తర్వాత వాళ్లిద్దరి ప్రయాణం ఎలా సాగిందనేది కథ.

## డిసి సక్సెస్‌తో మైత్రీమూవీ మేకర్స్ విజయోత్సవ వేడుక

టాలెంటెడ్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ ప్రధాన పాత్రలో నటించిన 'డిసి' చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకుని దూసుకుపోతోంది. ఈ సినిమా సాధించిన సంచలన విజయంతో చిత్ర పరిశ్రమలో ప్రశంసల జల్లు కురుస్తోంది. అయితే ఈ సినిమా సాధించిన సక్సెస్ నేపథ్యంలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా ప్రాజెక్ట్ 'ఎఎ23' టీమ్ మరియు ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ అధినేతలు డైరెక్టర్ లోకేష్ కనగరాజ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. 'డిసి' మూవీ బ్లాక్‌బస్టర్ సక్సెస్‌ను పురస్కరించుకుని చిత్ర యూనిట్ ఘనంగా వేడుకలు నిర్వహించింది. ఈ సెలబ్రేషన్స్‌కు సంబంధించిన ప్రత్యేక ఫొటోలను మైత్రి మూవీ మేకర్స్ సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. 'డిసి చిత్రానికి అఖండ విజయం అందించినందుకు అభినందనలు లోకేష్ కనగరాజ్. ఇప్పుడు ఎఎ23 వంతు! అంటూ మైత్రీ రాసుకొచ్చింది. ప్రస్తుతం డీసీ సక్సెస్ మూడ్‌లో ఉన్న లోకీ త్వరలోనే 'ఎఎ23' ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించబోతున్నాడు.



## కట్టలు తెంచుకున్న రోమాన్స్.. హుషారు పిట్టలు!

యువతరమే లక్ష్యంగా తీర్చిదిద్దిన తాజా చిత్రం 'హుషారు పిట్టలు'. ఏషియన్ సురేశ్ ఫిల్మ్స్ లాంటి పెద్ద సంస్థ దీన్ని స్వయంగా విడుదల చేస్తుండటం.. ప్రేక్షకుల దృష్టి ఈ సినిమాపై పడింది. రవి (అన్ష్) టాపర్. టెన్త్‌లో స్కూల్ ఫస్ట్. చదువు తప్ప మరో ధ్యాస లేని ఆ కుర్రాడిని.. ఊళ్లోని బాలు గ్యాంగ్ అశ్లీల వీడియోలు చూపించి చెడగొడుతుంది. దీంతో పుస్తకాల్ని పక్కకు పెట్టేసి అమ్మాయిల్ని పడేసే పనిలో పడతాడు. ఈ క్రమంలోనే అదే ఊరిలో ఉండే చిట్టిని ఇష్టపడతాడు. అప్పటికే అతనిపై ఆకర్షణతో ఉన్న ఆమె కూడా అతడికి దగ్గరవుతుంది. పరిపక్వత లేని ఆ వయసులో వాళ్లిద్దరూ హద్దులు దాటేస్తారు. ఓరోజు అలా కలిసి ఉండగా తల్లిదండ్రులకు దొరికిపోతారు. మరి ఆ తర్వాత ఏమైంది? తమ పిల్లల్ని అలా చూడకూడని స్థితిలో చూసిన ఆ తల్లిదండ్రులు ఏమైపోయారు? ఆ బాధని గుండెల్లో దాచుకుని ఎలాంటి కఠిన నిర్ణయాలు తీసుకున్నారు? ఓవైపు అమ్మానాన్నల వ్యతిరేకతను.. సమాజం నుంచి ఎదురయ్యే ఛీత్కారాలను ఎదుర్కొంటూ ఆ జంట తమ ప్రేమ కోసం ఏం చేశారు? దాని వల్ల వాళ్ల జీవితాల్లో చోటు చేసుకున్న పరిణామాలేంటి? ఆఖరికి వాళ్లు ఒక్కటయ్యారా.. లేదా? చిన్న వయసులో తెలిసీ తెలియక చేసిన తప్పు వల్ల ఆఖరికి వాళ్ల జీవితాలు ఎలా మారాయి? అన్నది మిగిలిన కథ. ఇది యువతరం లక్ష్యంగా రూపొందిన సినిమా. టీజర్.. ట్రైలర్‌లతోనే ఈ చిత్ర కంటెంట్ ఏంటి? ఎంత బోల్డ్‌గా ఉంటుందనే దానిపై స్పష్టత ఇచ్చేశా రు. 'బస్ స్టాప్', 'ఈరోజుల్లో..' లాంటి చిత్రాల ఛాయల్లోనే సాగుతుంది. సినిమాలో సింహభాగం అడల్ట్ కంటెంట్‌తో నవ్వులు పంచి.. ఆఖరిలో ఎమోషనల్ టచ్‌తో చిన్న సందే శం ఇచ్చి ప్రేక్షకుల్ని థియేటర్ నుంచి బయటికి పంపుతుం ది. ఇది పిల్లలతో పాటు తల్లిదండ్రులు చూడాల్సిన చిత్రమే అయినప్పటికీ.. ఆ అడల్ట్ కంటెంట్‌ని స్వీకరించే సాహసం చేస్తారా అన్నది సందేహమే. నాయకా నాయికల పాత్రల పరిచయం.. ఒకరిపై ఒకరికి ఆకర్షణ.. ఫోన్ ముచ్చట్లు.. హద్దులు దాటి దగ్గరయ్యేందుకు చేసే ప్రయత్నాలు.. కథలో సంఘర్షణని రగిలించేలా ఉంటాయి. అంత వరకు




చాటు మాటుగా సాగిన రవి - చిట్టీల వ్యవహారం ఇంటిదాకా చేరడంతో ద్వితీయార్ధం ఆసక్తికరం గా మొదలవుతుంది. కాకపోతే ఆయా సన్నివేశాలన్నీ ఊహలకు అందేలా ఉంటాయి. ఇక ఎప్పుడైతే వీళ్లు రెడ్ హ్యాండెడ్‌గా ఇంట్లో వాళ్లకి దొరికిపోతారో అక్కడి నుంచి కథ సీరియస్ టోన్‌లోకి టర్న్ తీసుకుంటుంది. రవి - చిట్టి తప్పటడుగులు వేయడం వెనకున్న కారణాల్ని బలంగా చెప్పే ప్రయత్నం చేశారు. పిల్లలు ఎదురుగా తల్లిదండ్రులు చేసే పనులు వాళ్ల వ్యక్తిత్వాలపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయి.. అతి గారాబం.. తప్పుడు స్నేహాలు, సెల్ ఫోన్ వాడకం వాళ్లని ఎలా తప్పుడు దారుల్లో నడిచేలా పురిగొల్పుతాయన్నది కళ్లకు కట్టినట్లు చూపించారు. పరిణతి లేని ప్రేమికుల్లా ఆ రెండు పాత్రల్లో అన్ష్, వాసవి సహజమైన నటనతో ఆద్యంతం అలరించారు. రొమాంటిక్ సీన్స్ తో పాటు భావోద్వేగ భరిత సన్నివేశాల్లోనూ మెప్పించారు. ముఖ్యంగా చిట్టి పాత్రలో వాసవి చెప్పే డైలాగ్స్.. శైలు పాత్రని ఇబ్బంది పెడుతూ తను చేసే హంగామా యువతకి బాగా వినోదాన్ని పంచిస్తుంది. కథానాయిక తండ్రి పాత్రలో గోవర్ధన్, హీరో తల్లిదండ్రులుగా సునీత, రమేష్ ఆకట్టుకుంటారు. ఇది తెలిసిన కథే అయినా.. యువతరాన్ని ఆకట్టుకునేలా మలచడంలో దర్శకుడు విజయం సాధించాడు.




## సైరాబాను ఫస్ట్ లుక్ విడుదల

హీరో ఆది సాయికుమార్ కథానాయకుడిగా నటిస్తున్న సరికొత్త తెలుగు చిత్రం 'సైరాబాను' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నేడు, స్వాతంత్య్ర దినోత్సవ సందర్భంగా ఆఫీషియల్‌గా రిలీజ్ చేశారు. ఈ సినిమాలో ఆది సాయికుమార్ సరసన 'మసూద' చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న బాంధవి శ్రీధర్ హీరోయిన్‌గా నటిస్తోంది. హాస్య మూవీస్ పతాకంపై ప్రముఖ నిర్మాత రాజేష్ దండా ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండగా, ఈ చిత్రం ద్వారా ఫణి కృష్ణ సిరికి దర్శకుడిగా తెలుగు చిత్రసీమకు పరిచయం అవుతున్నారు. ఈ సినిమా విభిన్న సంస్కృతుల నేపథ్యంలో సాగే ఒక పవర్‌ఫుల్ అండ్ వైబ్రెంట్ లవ్ స్టోరీగా తెరకెక్కుతోంది. ఔట్ అండ్ ఔట్ కామెడీ, ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా ఎలిమెంట్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ శేఖర్ చంద్ర స్వరాలను అందిస్తున్నారు. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ మూవీకి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే చిత్ర యూనిట్ ప్రకటించనుంది. అయితే పోస్టర్‌లోని నేపథ్యం కథను మరింత ఆసక్తికరంగా మారుస్తోంది. ఒకవైపు హిందూ దేవాలయం, మరోవైపు ఇస్లామిక్ శైలిలో నిర్మించిన కట్టడం రెండు విభిన్న ప్రపంచాలను ఒకే ఫ్రేమ్‌లో నిలబెట్టినట్లుగా అనిపిస్తోంది. మధ్యలో ఎగురుతున్న తెల్ల పావురాలు శాంతి, ప్రేమకు ప్రతీకగా నిలుస్తూ పోస్టర్ లుక్ మాత్రం ప్రేక్షకులను ఆకట్టుకుం టోంది. ఈ సినిమాలో హీరో ఆది సాయికుమార్ పక్కా తెలుగు సాంప్రదాయాలు, పద్ధతులు ఉన్న కుటుంబానికి చెందిన యువకుడిగా నటిస్తున్నారు. అలాగే, హీరోయిన్ బాంధవి శ్రీధర్ ఆధునిక ఆలోచనలు ఉన్న ముస్లిం యువతి (సైరాబాను) పాత్రలో కనిపిస్తున్నారు. వేర్వేరు నేపథ్యాలు, ఆచారాలు ఉన్న ఈ ఇద్దరి మధ్య ప్రేమ ఎలా చిగురించింది, వారి ప్రేమను గెలిపించుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు పడ్డారు అనేదే ఈ సినిమా కథాంశం.



## క్యూట్‌లుక్‌లో రుక్మిణి వసంత్

నటి రుక్మిణి వసంత్ ప్రస్తుతం వరుస సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంటూ జెట్ స్పీడ్‌లో తన కెరీర్‌ను ముందుకు సాగిస్తోంది. రుక్మిణి తాజాగా 'టాక్సిక్' చిత్రంలో నటించింది. ఈ మూవీ ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో ప్రస్తుతం ఈ సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొంటూ రుక్మిణి ఎంతో బిజీగా ఉంది. మరోవైపు జూనియర్ ఎన్టీఆర్ హీరోగా రూపొందుతున్న 'డ్రాగన్' చిత్రంలో ఈ బ్యూటీ హీరోయిన్‌గా నటిస్తోంది. అలాగే రామ్ చరణ్, సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమాలోనూ

రుక్మిణిని హీరోయిన్‌గా తీసుకునే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు ఓ వార్త వైరల్ అవుతోంది. ఇదిలా ఉంటే.. ఇప్పటివరకు సినిమాల్లో పెద్దగా అందాల ఆరబోతకు ప్రాధాన్యత ఇవ్వని రుక్మిణి, సోషల్ మీడియాలోనూ గ్లామర్ ట్రీట్‌తో తరచూ సందడి చేయడం లేదు. అయితే తాజాగా ఈ ముద్దుగుమ్మకు సంబంధించిన కొన్ని ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోల్లో రుక్మిణి ఎల్లో కలర్ స్లీవ్‌లెస్ డ్రెస్‌లో కనిపించింది. దానికి తగిన చున్నీని ధరించి, కురులను అందంగా మొహం, భుజంపై పడేలా స్టైల్ చేసుకుంది. ఇయర్ రింగ్స్‌తో పాటు చేతివేళ్లకు ఉంగరాలు ధరించి, చిరునవ్వులు చిందిస్తూ ఫోటోలకు స్టిల్స్ ఇచ్చింది. ఎల్లో డ్రెస్‌లో రుక్మిణి వసంత్ చాలా సింపుల్‌గా, సూపర్ క్యూట్ లుక్‌లో కనిపించడంతో ఈ ఫోటోలు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం ఆమెకు సంబంధించిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## విజయ్ రణబాలి నుంచి పోస్టర్ విడుదల

స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ నటిస్తున్న భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' సినిమా నుంచి మేకర్స్ ఒక పవర్‌ఫుల్ పోస్టర్‌ను విడుదల చేశారు. దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం 1854-1878 కాలంలో రాయలసీమ నేపథ్యంలో బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా సాగే చారిత్రక పోరాటం ఆధారంగా రూపుదిద్దుకుంటోంది. 'మరపురాని చరిత్రలోని అత్యంత సాహసోపేతమైన అధ్యాయం అనే ట్యాగ్‌లైన్‌తో ఈ పోస్టర్ హైలైట్ అవుతోంది. ఈ పోస్టర్‌లో విజయ్ దేవరకొండ రక్తం, మట్టితో కూడిన యుద్ధ వీరుడి రూపంలో కనిపిస్తున్నారు. ఆయన పొడవుగా ఉన్న జుట్టు, మీసం, ఒంటిపై గాయాలు ఈ పాత్ర తీవ్రతను తెలియజేస్తున్నాయి. జాతీయ జెండా ఆయన భుజంపై ఒక యోధుడి కవచంలా కప్పబడి ఉంది. దీనికి ఉన్న రక్తపు మరకలు స్వాతంత్య్ర పోరాటంలోని త్యాగాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఇక ప్రస్తుతం ఇందుకు సంబంధించిన లుక్ వైరల్‌గా మారింది. ఈ చిత్రంలో విజయ్ సరసన రష్మిక మందన్న నటిస్తుండగా, హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ (ది మమ్మీ ఫేమ్) కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.




PUBLISHED AND OWNED BY DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500083..EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com